ఎన్టీఆర్ జిల్లా, నున్న సబ్ డిస్ట్రిక్ట్, విజయవాడ రూరల్ మండలం, పాతపాడు గ్రామ పంచాయితీ ఏరియా, పాతపాడు గ్రామం, ఆర్.ఎస్.నెం.217/5బి3 లోని ఎ.0.47 సెంట్ల విస్తీర్ణం గల సేరి మెట్ట భూమి. హద్దులు : తూర్పు : సర్కార్ రోడ్డు, దక్షిణం : పిల్లా కనకమ్మ గారి భూమి, పడమర : పోతిన సింహాచలం గారి భూమి, ఉత్తరం : పోతిన దుర్గారావు మొ|| వారి భూమి.

పైన తెలిపిన హద్దులలో విస్తీర్ణం ఎ.0.47 సెంట్లు లేదా 0.190 హెక్టార్లు సేరి మెట్ట భూమి మాత్రమే. (ఈ ఆస్తి డాక్యుమెంట్ నెం.192/2012, నున్న ఎస్ఆర్ఓ ప్రకారం కలదు).

ప్రదేశం : విజయవాడ
తేది : 18-10-2024
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆఫీస్ చిరునామా : 29-37-141, 2వ ఫ్లోర్, రామ మంథిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8 (6) రూలు క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

ఋణగ్రహీతలు/హామీదారుల వివరములు : 1. నరేంద్ర కుమార్ కోదూరు, తండ్రి : పూర్ణ చంద్రరావు, డి.నెం.21-3-39/బి, భగత్‌సింగ్ రోడ్డు, ముత్యాలంపాడు, విజయవాడ - 520011. 2. కోదూరు లక్ష్మీ కుమారి, భర్త : పూర్ణ చంద్రరావు, డి.నెం.21-3-39/బి, భగత్‌సింగ్ రోడ్డు, ముత్యాలంపాడు, విజయవాడ - 520011. 3. బెల్లంకొండ రఘునాథ స్వామి, తండ్రి : చిన్న వీర భద్రయ్య, డి.నెం. 21-5-28/1, వనపాల వారి వీధి, ముత్యాలంపాడు, విజయవాడ అర్బన్, సత్యనారాయణపురం, ఎన్టీఆర్ జిల్లా - 520011.

సర్/మేడమ్,

విషయం : 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలుతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : నరేంద్ర కుమార్ కోదూరు కు చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన.

సూచిక : ఋణ ఒప్పంద నెం. VIJA4TF1606210001

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది.30-11-2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్ కార్పొరేషన్ తేది.30-11-2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిస్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేటు, గిండీ, చెన్నై - 600032 మరియు మన కార్యాలయం ఉన్న చోటు : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.29-37-141, 2వ అంతస్తు, రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 మరియు విజయవాడ-4లో బ్రాంచి కార్యాలయం గలదు. (ఇక నుంచి కంపెనీగా/ ఋణదాతగా పిలవబడేది).

సెక్యూర్డ్ ఋణదాత - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింది తేది.27.01.2023న జారీ చేసిన డిమాండ్ నోటీసుతో పేర్కొన్న తేది.27.01.2023 నాటికి బకాయి మొత్తం రూ.1,08,01,480/- (అక్షరాల ఒక కోటి ఎనిమిది లక్షల ఒక వేయి నాలుగు వందల ఎనభై రూపాయలు మాత్రమే) తో పాటు ఇటీవల వడ్డీ/ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితిలోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను తేది.08.06.2023న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి. మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో తేది.04.05.2024న భౌతిక స్వాధీనం కూడా చేసుకొనిరి.

సెక్యూర్డ్ ఆస్తి స్వాధీనం చేసుకున్నప్పటికీ, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి మీరు బకాయి మొత్తాన్ని చెల్లించలేదు. అందువల్ల దిగువ వివరించిన ఆస్తిని బహిరంగ ఇ-వేలం ద్వారా ఈ నోటీసు ప్రచురించిన తేది ఈ నోటీసు చేరిన తేదీ నుంచి గల 30 రోజుల తర్వాత, విడిగా ఇ-వేలం అమ్మకం నోటీసు ఇచ్చి అమ్మవల్సిన అవసరం ఏర్పడింది. ఇ-వేలం జరిగే తేది మరియు సమయంతో పాటు ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించనున్న సర్వీసు ఏర్పాటుదారుని వివరాలను విడిగా మీకు తెలుపబడును.

అందువల్ల మీరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడ్డ మొత్తంతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి అయిన ఖర్చులను మరియు అయిన ఇటీవల వడ్డీ, ఖర్చులు, ఛార్జీల మొత్తాన్ని అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా చెల్లించినచో, ఆస్తి అమ్మకంపై ఏలాంటి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన ప్రకారం మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.

ఆస్తి షెడ్యూలు : డాక్యుమెంట్ నెం.2063/2016, నున్న ఎస్ఆర్ఓ ప్రకారం నరేంద్ర కుమార్ కోదూరు గారికి చెందినది

కృష్ణాజిల్లా, నున్న సబ్ రిజిస్ట్రీ, విజయవాడ రూరల్ మండలం, జక్కంపూడి గ్రామం మరియు గ్రామ పంచాయితీ ఏరియా, ప్లాట్ నెం. 19, ఆర్.ఎస్.నెం. 249/2 లోని 153.33 చ||గ||లు లేదా 128.20 చ||మీ||ల విస్తీర్ణం గల ఖాళీ నివాస స్థలం. హద్దులు : తూర్పు : రాయవరపు ఆనందరావు గారి ప్లాట్ నెం.5 - 60 అ||లు, దక్షిణం : షేక్ అఫ్జర్ మియా గారి ప్లాట్ నెం.18 - 23 అ||లు, పడమర : గొట్టుముక్కల నాగరాజు గారి మిగిలిన ఆస్తి - 60 అ||లు, ఉత్తరం : 35 లింకుల వెడల్పు పంచాయితీ బజారు - 23 అ||లు.,

ప్రదేశం : విజయవాడ
తేది : 18-10-2024
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

తిరువూరు

• తిరువూరు • మైలవరం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలతో కరస్పాండెంట్ సురేష్, హెచ్‌ఎం రమేష్

విద్యార్థుల సృజనకు పదును

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలోని సృజనకు పదును పెట్టుకోవచ్చని స్థానిక గౌతమ్ పాఠశాల కరస్పాండెంట్ జి.సురేష్ పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పరీక్షల్లో భాగంగా బుధవారం ఆ పాఠశాలలో.. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీ పరీక్షలు నిర్వహించారు. పోటీల్లో బీవీఎస్ జాహ్నవి, జె.జయశ్రీ, జి.హర్షితలు మొదటి మూడు స్థానాలు సాధించి, బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.రమేష్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

మట్టి దిబ్బల తొలగింపు

మండలంలోని పుల్లూరు శివారు చిలుకూరివారిగూడెంలో మురుగు కాలువలకు అడ్డంగా మట్టి దిబ్బలు ఉండడంతో మురుగు నీరంతా రహదారిపైకి చేరుతున్న వైనంపై స్థానికుల ఫిర్యాదును ఎంపీడీవో పి.అనురాధ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో తొలగింపు చర్యలను చేపడుతున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

మూడు గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నేడు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో భూములు రీసర్వే జరిగిన తిరువూరు మండలం ముష్టికుంట్ల, గంపలగూడెం, ఎ.కొండూరు మండలం తూర్పు మాధవరంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తామని ఆ మండలాల రెవెన్యూ అధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎస్.మణికుమార్ అండర్-17 బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.క్రిస్టోఫర్, హెచ్.అంజయ్య బుధవారం తెలిపారు. జగ్గయ్యపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో ప్రతిభ చూపి ఎంపికైన తమ విద్యార్థి త్వరలో అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు.



మణికుమార్‌తో ఉపాధ్యాయులు

అండర్ -14 విభాగంలో..

గంపలగూడెం: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వేల్పుల వరలక్ష్మి అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.కిరణ్‌కుమార్, పీడీ బి.రాంబాబు బుధవారం తెలిపారు. జగ్గయ్యపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో ప్రతిభ చూపి ఎంపికైన తమ విద్యార్థిని త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.



వరలక్ష్మితో అధ్యాపకులు

వసతులు రానున్నాయ్

సెంటు పట్టా లబ్ధిదారులకు మంచి రోజులు

కొండపల్లి, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వ సానుకూలతతో జగనన్న కాలనీ వాసులకు మంచి రోజులు రానున్నాయి. గత కలెక్టర్ సృజన ఆదేశాలతో విజయవాడ జోనల్ కమిషనర్ రమ్యకీర్తన పురపాలికలోని కొండపల్లి, ఇబ్రహీంపట్నం సెంటు పట్టాల్లో నిర్మించాల్సిన మురుగు కాలువలు, తాగునీటి సౌకర్యానికి సంబంధించి అవసరమైన అంచనాలను రూపొందించారు. ఆ అంచనాలు గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో అన్ని మౌలిక వసతులను త్వరలో ఆచరణలోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో సెంటు పట్టా గృహస్థులకు త్వరలో మౌలిక వసతులు ఏర్పాటు కానున్నాయి.



వర్షం పడినప్పుడు కాలనీ రహదారుల పరిస్థితి (పాత చిత్రం)

అట్టహాసంగా ప్రారంభించినా

గత ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా ప్రారంభించిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఐదేళ్ల పాటు కష్టాల్లో కూరుకుపోయాయి. అనేక మంది లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాల్లో బేస్ మట్టం పనులు పూర్తి చేసుకొని అంతటితో వదిలేయగా.. ఇళ్లు నిర్మించుకొని నివాసాలు ఉండే వారికి మాత్రం కనీస మౌలిక సదుపాయాలు లేక అవస్థలు తప్పలేదు. గత నెలలో కాలనీ మీదకు వచ్చిన వరద ధాటికి కాలనీలు జల దిగ్బంధమయ్యాయి. కూటమి ప్రభుత్వం, దాతలు స్పందించి పది రోజుల పాటు ఆహార పానియాలు సమకూర్చి అక్కడి వారిని ఆదుకున్నారు.

పురపాలికలో ఇదీ పరిస్థితి

కొండపల్లి పురపాలిక పరిధిలో ఇబ్రహీంపట్నం సడక్‌రోడ్డు, కొండపల్లి శివారు, ఈలప్రోలు వద్ద గత ప్రభుత్వంలో సెంటు పట్టాలు కేటాయించారు. ఇబ్రహీంపట్నం కాలనీల్లో 1,600 ప్లాట్లకు గానూ 650 మంది నిర్మాణాలు పూర్తి చేసుకోగా.. కొండపల్లి శివారు ఈలప్రోలు, శాంతి నగర్‌లలోని 1,500 ప్లాట్లగానూ 450 మంది నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. అయితే వాటిల్లో గత ప్రభుత్వం మౌలిక వసతుల ఏర్పాటు చేయకపోవడంతో నానా తిప్పలు పడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో సమస్యలు తీరనున్నాయని కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళికలు రూపొందిస్తున్నాం

– కమిషనర్ పి.శ్రీనివాసరావు

సెంటు పట్టా భూముల్లో మౌలిక వసతుల బాధ్యత పూర్తిగా గృహ నిర్మాణ శాఖదే. పురపాలిక పరిధిలో ఉన్నా, దాని బాధ్యతలు ఆ శాఖనే నిర్వహించాల్సి ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్కడ కల్పించాల్సిన మౌలిక వసతులను గుర్తించాం. ఉన్నతాధికారులు దానిపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు. త్వరలోనే వివిధ శాఖల ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పనకు అడుగు ముందుకు పడనుంది.

కాల్వల్లో పూడిక తీత

జి.కొండూరు: నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీత ప్రారంభించింది. పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఆధ్వర్యంలో ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి. కూటమి నాయకులు ప్రతిపాటి ఆదెం, వెంకటనారాయణ, రవి, శ్రీనివాసరావు, రహ్మతుల్లా, స్వామి, వీరయ్య, నారాయణ, చింతయ్య తదితరులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో రేపూడి బజార్‌లో బుధవారం సాయంత్రం అందిన సమాచారం మేరకు దాడి చేసిన కోడిపందేలు వేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు సెక్టార్-2 ఎస్సై వి.వెంకట్రావు తెలిపారు. నిందితుల నుంచి రూ.2,820, రెండు కోడిపుంజులు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

నరసాపురం(విస్సన్నపేట): మండలంలోని నరసాపురంలో బుధవారం విజయవాడ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో నాటుసారా విక్రయిస్తున్న అంగోతు శంకర్‌ను అరెస్టు చేసినట్లు తిరువూరు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణమూర్తి తెలిపారు. నిందితుడి వద్ద 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుని తిరువూరు న్యాయస్థానంలో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని, నూజివీడు ఉపకారాగారానికి తరలించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

స్పందించారు.. గుంతలు పూడ్చారు

మండలంలోని కందులపాడు గంగినేని ఎర్రుపాలెం కేజీవై రహదారి విస్తరణ అభివృద్ధి పనులు గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. సమస్యపై ఈ నెల 9వ తేదీన ఈనాడులో 'వామ్మో మోకాలి లోతు గుంతలు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు, గుత్తేదారులు ఎట్టకేలకు పనులు ప్రారంభించారు. ముందుగా ఇటీవల సంభవించిన వరదలకు కోతకు గురై గుంతలు ఏర్పడిన ప్రాంతాన్ని సరిచేస్తున్నారు. అనంతరం రహదారి విస్తరణ అభివృద్ధి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**



మధిర శాఖ కాల్వకు 655 క్యూసెక్కుల సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మధిర బ్రాంచి కెనాల్‌కు బుధవారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 655 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 224 క్యూసెక్కులు చేరగా, దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు 50, పెదకొమిర 20, మధిర 25, నిదానపురం 40 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రంగాపురంలోని డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం జిల్లా వైద్యశాఖ అధికారిణి డాక్టర్.సుహాసిని, బాలస్వాస్త (ఆర్‌బీఎస్‌కె) నోడ్ అధికారిణి డాక్టర్ మాధవిలు తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందజేస్తున్న భోజనశాలను, వసతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆర్వో ప్లాంట్‌ను తనిఖీ చేసి నీటి లభ్యతపై ప్రిన్సిపల్ తబితకు సూచనలు, సలహాలు అందజేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలన చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్.సందేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



భోజనశాల పరిశీలిస్తున్న అధికారులు

తెలుగు ఉపాధ్యాయులకు తరగతులు

తిరువూరు, న్యూస్‌టుడే: పదో తరగతి 2024-25 విద్యా సంవత్సరంలో నూరుశాతం ఫలితాల సాధించడమే లక్ష్యంగా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలని తిరువూరు బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం పి.సత్యనారాయణరాజు సూచించారు. నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల్లో తెలుగు బోధించే 33 మంది ఉపాధ్యాయులకు మారిన పాఠ్యపుస్తకాలపై బుధవారం పునఃశ్చరణ తరగతి నిర్వహించారు. మారిన పాఠ్యపుస్తకాల బ్లూప్రింట్, బోధనలో మెలకువలు, మంచి మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణులు అవ్వడానికి బోధించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈవో శ్యామ్‌సుందరరావు, ఆర్పీలు పాల్గొన్నారు. గురువారం హిందీ బోధించే ఉపాధ్యాయులకు తరగతి నిర్వహిస్తారు.



తిరువూరు బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

పక్షం రోజుల్లో ఫిర్యాదులు పరిష్కరిస్తాం

కొర్లమండ(విస్సన్నపేట), న్యూస్‌టుడే: తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో నిర్వహిస్తున్న గ్రామసభల ద్వారా భూ సంబంధిత సమస్యలపై రైతులు ఇచ్చిన ఫిర్యాదులను పక్షం రోజుల్లో పరిష్కరిస్తామని ఆర్డీవో కె.మాధురి తెలిపారు. కొర్లమండలో బుధవారం జరిగిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. తహసీల్దారు లక్ష్మీకల్యాణి, డివిజనల్ సర్వేయర్ సారంగపాణి, సీనియర్ సహాయకులు కె.రవికుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.



కొర్లమండలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి, పక్కన తహసీల్దార్ లక్ష్మీకల్యాణి



సబ్జపాడులో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, అధికారులు

గ్రామ సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు

కొర్లమండ గ్రామసభలో పాల్గొన్న ఆర్డీవో మాధురికి పలువురు రైతులు గ్రామ సచివాలయం సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. సచివాలయం ఊరికి వెలుపల ఉండడంతో సిబ్బంది విధులకు సక్రమంగా రావడం లేదని, రైతులు పని నిమిత్తం వెళ్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. స్పందించిన ఆమె గ్రామ సచివాలయాన్ని తరచూ తనిఖీ చేస్తామన్నారు.

కుమ్మరికుంట్ల(ఎ.కొండూరు): కుమ్మరికుంట్లలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో భూ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని 31 మంది రైతులు అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు బి.ఆశయ్య తెలిపారు. సర్పంచి ఎల్.గీతామహాలక్ష్మి, మండల సర్వేయర్ దుర్గారావు పాల్గొన్నారు.

అనుముల్లంక(గంపలగూడెం): అనుముల్లంకలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో 40 మంది రైతులు అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు వి.రాజకుమారి తెలిపారు. ఆర్ఐ ఎం.వీరభద్రరావు, మండల సర్వేయర్ సాంబశివరావు, వీఆర్వో కనకదుర్గారావు పాల్గొన్నారు.

చిట్టేల(తిరువూరు): చిట్టేల గ్రామసభలో రైతుల 63 అర్జీలు అందాయని తహసీల్దారు కె.లక్ష్మి తెలిపారు.

అర్జీలు సమర్పించారు. ఉప తహసీల్దారు సుజాత, సర్వేయర్ భాను, గ్రామకార్యదర్శి అనిల్ కుమార్, రెవెన్యూ అధికారి నరేంద్ర పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే గ్రామసభలను ఉపయోగించుకుని రైతులు తమ భూసమస్యలను పరిష్కారించుకోవాలని తిరువూరు ఆర్డీవో మాధురి అన్నారు. బుధవారం రుద్రవరం గ్రామ సచివాలయం నిర్వహించిన గ్రామసభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ జె.సుశీలదేవి, ఉపసర్పంచి బి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సర్పంచి తమ్మలపల్లి శ్రీనివాసరావు, మండల సర్వేయరు ఎన్.గోపాలకృష్ణ, ఆర్ఐ బి.మోహన్‌రావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంగ్రామీణం: మూలపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ భూ రీ సర్వే గ్రామసభలో ఎనిమిది మంది రైతులు తమ పొలం సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దాలని తహసీల్దారు వెంకటేశ్వర్లుకు

దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

మైలవరం, న్యూస్‌టుడే: భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సబ్జపాడులో గ్రామసభ నిర్వహించి, ప్రజల నుంచి 24 దరఖాస్తులు స్వీకరించారు. ఏడీ సర్వే తివిక్రమ్, సర్పంచి శ్రీనివాసరావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జి.కొండూరు: మండలంలోని గుర్రాజుపాలెంలో రెవెన్యూ గ్రామ సభ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులు హాజరై తమ సమస్యలను సిబ్బందికి తెలియజేయగా క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీఆర్వో రాజేష్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాల దొంగను పోలీసులు అరెస్టు చేశారు. సత్తుపల్లిలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసీపీ ఎ.రఘు బుధవారం వివరాలు వెల్లడించారు. పెనుబల్లి మండలంలోని ఉప్పలచెలక సెంటర్‌లో ఎస్సై వెంకటేశ్ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. బంజర్ నుంచి కొత్తగూడెం వైపునకు నంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్న స్కూటీని ఆపారు. విచారించగా తనది ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం కనుమూరుకు చెందిన షేక్ మౌలాలీగా తేలింది. వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించడం కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ నెల 17న రాత్రి పాతకారాయిగూడెంలో ఇంటి ఆరుబయట నిలిపి ఉన్న స్కూటీని దొంగతనం చేసి తరలిస్తున్నట్లుగా దర్యాప్తులో తేలింది. గతంలో తిరువూరు బస్టాండ్‌లో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనాన్ని కూడా దొంగిలించగా ఆయా ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.

తెలుగు మహిళపై దాడి

గంపలగూడె: గోసవీడులో బుధవారం రాత్రి తెలుగు మహిళ గద్దల హర్షితపై దాడి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన 8 మంది వైకాపా వర్గీయులు నాపై అకారణంగా దాడి చేశారని హర్షిత ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బాధితురాలిని కుటుంబీకులు చికిత్స నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మద్యం సీసాల స్వాధీనం

వావిలాల (తిరువూరు) : వావిలాల సమీపంలో బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో తెలంగాణ మద్యం అక్రమంగా తరలిస్తున్న బుచ్చాల హనుమంతరావును అరెస్టు చేసినట్లు సెక్టార్-1ఎస్సై సత్యనారాయణ తెలిపారు. నిందితుడి వద్ద రూ.14,910 విలువైన 111 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తిరస్కరించిన దరఖాస్తులు పరిశీలించండి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వరద బాధితుల పరిహారానికి సంబంధించి తిరస్కరించిన దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని సీపీఎం మండల కార్యదర్శి మహేష్ అన్నారు. కొండపల్లి అంబేడ్కర్ కాలనీ వాసులు తహసీల్దారు వై.వెంకటేశ్వర్లును బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఏసుపాదం, కోటేశ్వరరావు, సోమేష్, లక్ష్మీ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుపై కేంద్రం పునరాలోచించాలి



మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

కొండపల్లి, న్యూస్‌టుడే: వక్ఫ్ బిల్లుపై కేంద్రం పునరాలోచించాలని ముస్లిం మత పెద్దలు కోరారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే వక్ఫ్‌బోర్డు బిల్లుపై కొండపల్లి షాబుఖారీ మసీదు ఆవరణలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన బిల్లులో వక్ఫ్ ఆస్తులకు రక్షణ కరవవుతుందన్నారు. దేశ వ్యాప్తంగా ముస్లింలు దీనిపై పోరాటాలకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆ బిల్లుతో వక్ఫ్ ఆస్తులు ఇతరుల చేతికి వెళ్లే ప్రమాదం ఉందని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికే అనేక ముస్లిం ఆస్తులు ఇతరుల చేతుల్లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అల్తాఫ్ రజాబాబా, ముఫ్తీ సుల్తాన్ రజా, అజ్మీరే సాజిద్ హుస్సేన్, సలాహుద్దీన్, షాహిద్ రజా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గండ్రాయి జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ శిక్షకుడు వై.గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలంటే విద్యార్థి దశ ఎంతో కీలకమైందని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాకపోకల పునరుద్ధరణ

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద మల్లింపు రోడ్డుకు బుధవారం తెదేపా నాయకుడు బి.నారాయణ ఆధ్వర్యంలో మరమ్మతులు పూర్తి చేయడంతో రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. సోమవారం ఎగువున కురిసిన భారీ వర్షానికి కట్లేరుకు వరద నీరు చేరింది. మంగళవారం మళ్లింపు రోడ్డుపై వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. వరదకు మళ్లింపు రోడ్డుపై మట్టి కొట్టుకుపోయి రాళ్లు బయటపడ్డాయి. మరమ్మతులు చేయడంతో వాహనాలు మళ్లీ రోడ్డుపై తిరుగుతున్నాయి.



మళ్లింపు రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న తెదేపా నాయకులు

గుంతలెక్కువ.. రోడ్డు తక్కువ

భారీ గుంతలతో అత్యంత దుర్భరంగా మారిన ఇబ్రహీంపట్నం ఖిల్లా రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. విజయవాడ -హైదరాబాద్ జాతీయరహదారి నుంచి ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు వరకు ఉన్న ఈ మార్గం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. గడిచిన ఐదేళ్లలో కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఏడాదికేడాది గుంతలు పెద్దవై వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పర్యాటకులు కొండపల్లి ఖిల్లా సందర్శించాలన్నా, ఖిల్లాపై ఉన్న దూరదర్శన్ కేంద్రానికి వెళ్లాలన్నా, రెండు ప్రధాన ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు దాదాపు రెండు వందల కుటుంబాలు నివసించే కాలనీలకు వెళ్లడానికీ ఇదే కీలక మార్గం. సామర్థ్యానికి మించి బూడిద చెరువు నుంచి నిత్యం వందలాది బూడిద వాహనాల రాకపోకల సాగించడం మూలానే రోడ్డుకు ఈ దుస్థితికి చేరిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని మరమ్మతులు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నంగ్రామీణం**



దేశానికి రక్షణ కవచం పోలీసులు



విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన కల్పిస్తున్న సీఐ గిరిబాబు

తిరువూరు, న్యూస్‌టుడే: దేశం కోసం, ప్రజల కోసం పోలీసులు నిరంతరం రక్షణ కవచంగా విధులు నిర్వహిస్తారని సీఐ కె.గిరిబాబు తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఠాణాలో బుధవారం గీతమ్స్ విద్యాలయం విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన కల్పించారు. కేసులు నమోదు, నిందితులు అరెస్టు, దస్త్రాలు నిర్వహణ, ఆయుధాలు, 100, 112 నంబర్లకు కాల్ చేయడం, సీసీ కెమేరాల ఉపయోగాల గురించి తెలిపారు. సెక్టార్-2 ఎస్సై వి.వెంకట్రావు, హెడ్ కానిస్టేబుల్ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఈ-పంట భౌతిక రశీదులు

తిరువూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఈ-పంట నమోదు రశీదులను రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏల వద్ద తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పిట్టల పద్మ రైతులకు సూచించారు. మండలంలో చౌటపల్లిలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులతో కలిసి వరిలో కంకులను పరిశీలించారు. వరిలో గింజలు పాలు పోసుకునే దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

భరోసా.. ఇక హైలెస్సా


కూటమి ప్రభుత్వ హామీతో రహదారి అభివృద్ధి పనులు

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే:

ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని దొనబండ కీసర రహదారి అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ఐదేళ్లుగా ఈ మార్గం అడుగడుగునా గుంతలు పడి దారుణంగా తయారైంది. చిలుకూరు, దాములూరు, కొత్తపేట, ఆత్కూరులతో పాటు మరో నాలుగు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ఈ రహదారి నుంచే ప్రయాణాలు సాగిస్తుంటారు. దొనబండ నుంచి కీసర వరకు 14 కిమీ మేర ఎక్కడికక్కడే గోతులు పడి కోతకు గురవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పనులు ప్రారంభమయ్యాయి...

వర్షాకాలంలో రహదారిలోని ఏనుగుగడ్డ వాగుపై ఉన్న లోలెవల్ వంతెనల వద్ద వాగు వరద వంతెనపై ఐదారు అడుగులు నిలిచి రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయేవి. అధికారులు చర్యలు చేపట్టి గుంతలు పూడ్చించి రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని ఈనాడులో పదే పదే కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రయాణికులు కూడా ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ప్రభుత్వవర్గాల నుంచి వచ్చిన హామీ, భరోసాలతో గుత్తేదారుడు పనులు ప్రారంభించారు.



ముమ్మరంగా జరుగుతున్న దొనబండ కీసర రహదారి పనులు

నాడు ఒక్క రూపాయి ఇవ్వలేదు..

గతంలోనే దెబ్బతిన రహదారి ఇటీవల వర్షాలకు మరింత దుస్థితికి చేరింది. వైకాపా ప్రభుత్వంలోనే రోడ్డు అభివృద్ధికి రూ.13 కోట్లు మంజూరు చేసింది. అయితే పనులు చేసినా బిల్లులు సకాలంలో మంజూరు కావనే ఉద్దేశంతో గుత్తేదారుడు ముందుకు రాలేదు. రహదారి అభివృద్ధి పనులతోపాటు ఏనుగుగడ్డ వాగుపై ఉన్న లోలెవల్ వంతెనలను హైలెవల్‌గా అభివృద్ధి చేయాలని చిలుకూరు సర్పంచి సురేష్ విజ్ఞప్తి చేశారు.

విజయవాడ తూర్పు


ప్రతిభ చూపారు.. బహుమతి పట్టారు




వ్యాసం రాస్తున్న విద్యార్థులు.. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ సుధాప్రవీణ ముక్తేవి తదితరులు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : సిద్ధార్థనగర్‌లోని లిటిల్ బ్రైన్స్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు ఏర్పాటు చేశారు. 'ఇంటర్‌నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన టి.సాయిశ్రీకర్ (పదో తరగతి), కేఎస్ఎల్ దిషిత (9వ తరగతి), ఎస్కే ముష్కన్ (8వ తరగతి)లకు ప్రిన్సిపల్ సుధా ప్రవీణ ముక్తేవి బహుమతులు అందజేశారు.

ఆపన్నులకు అండగా సీఎం సహాయనిధి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పేద వర్గాలు శస్త్రచికిత్సలు చేయించుకోవాలంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అటువంటి వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సున్నపుబట్టీల కూడలిలోని అమ్మ కల్యాణ మండపం సమీపంలో, ఆరో డివిజన్ తెదేపా కార్యాలయం దగ్గర సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఏ ముఖ్యమంత్రి ఇవ్వని విధంగా చంద్రబాబు ఎంతో మంది ఆపదలో ఉన్న వారికి కోట్లాది రూపాయలు అందించి భరోసాగా నిలిచారని పేర్కొన్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో రూ.16 కోట్లు అందజేశామని గుర్తు చేశారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నాయకులు నందిపాటి దేవానంద్, పడాల గంగాధర్, ఎ.రామకృష్ణ, పి.దుర్గాప్రసాద్, దోమకొండ రవి తదితరులు పాల్గొన్నారు.

చెత్త ఒప్పందానికి స్వస్తి

నగరపాలక సంస్థకు తగ్గిన కిస్తీల భారం

ఏటా రూ.13.92 కోట్లు మిగులు

నగరంలో నిత్యం చెత్త ఉత్పత్తి	550-610 మెట్రిక్ టన్నులు
గత ప్రభుత్వం కేటాయించిన సీఎన్‌జీ వాహనాలు	225
ఒక వాహనం ట్రిప్పునకు తరలించిన చెత్త	750 కిలోలు
ప్రస్తుతం ఉపయోగిస్తున్న ట్రాక్టర్లు	140
ఒక ట్రాక్టర్ ట్రిప్పునకు తీసుకెళ్తున్న వ్యర్థాలు	2 టన్నులు
సీఎన్‌జీ వాహనాల కిస్తీల భారం	నెలకు రూ.1.16 కోట్లు



ట్రాక్టర్‌లో వ్యర్థాలు తరలిస్తున్న సిబ్బంది

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

గత ప్రభుత్వ పెద్దలు తమ సంబంధీకుల సంస్థ స్వప్రయోజనాల కోసం నగరపాలక సంస్థకు అంటగట్టిన 225 సీఎన్‌జీ వాహనాలను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టింది. ఫలితంగా ప్రతి నెలా నగరపాలక సంస్థ నెత్తిన మోపిన రూ.1.16 కోట్ల కిస్తీల భారం తప్పింది. ఏటా రూ.13.92 కోట్లు మిగిలింది. సీఎన్‌జీ వాహనాలకు ప్రత్యామ్నాయంగా నగరపాలక సంస్థకు చెందిన 40 వాహనాలకు, 140 ట్రాక్టర్లకు ఇటీవల మరమ్మతులు అందుబాటులోకి తీసుకువచ్చారు. దాంతో రూ.కోట్ల కిస్తీల భారం మాయమైంది.

వాహనాలను పక్కన పెట్టించి..

చెత్త తరలింపునకు నగరపాలక సంస్థ పరిధిలో గతంలో డంపర్ ప్లేసర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీలు, లోడర్లు, 10 టైర్ల వాహనాలు ఉండేవి. వాటిల్లో అత్యధిక వాహనాలను గత ప్రభుత్వం తమ అనుచరుల సంస్థ ప్రయోజనం కోసం మూలన పడేయించింది. వాటి స్థానే 225 సీఎన్‌జీ వాహనాలను అంటగట్టింది. వాటిని సరఫరా చేసిన 'స్వయంభూ' సంస్థకు ప్రతి నెలా రూ.1.16 కోట్లు చెల్లించేలా నాటి ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అందుకు వైకాపా నగర పాలకులు తలాడించారు. సీఎన్‌జీ వాహనాలకు 2022 నుంచి 2024 సెప్టెంబరు వరకు నెలవారీ కిస్తీల భారం రూ.34.35 కోట్లు నగరపాలక సంస్థ భరించింది. రూ.కోట్లు వెచ్చించినా చెత్త తరలించడంలో ఆ వాహనాలు విఫలమయ్యాయనే ఆరోపణలున్నాయి. ఆ సంస్థకు చెల్లించిన సొమ్ముతో కొత్త వాహనాలను నగరపాలక సంస్థ కొనుగోలు చేసుకునే అవకాశం ఉండేది.

మొత్తం తరలిపోతూ..

ప్రస్తుతం చెత్త తరలించేందుకు నగరపాలక సంస్థ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. నిత్యం ఉత్పత్తి అవుతున్న చెత్తను సింగ్‌నగర్, ఆటోనగర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు పంపుతున్నారు. అక్కడ నుంచి గుంటూరు జిల్లా నాయుడుపేటలోని జిందాల్ సంస్థకు తరలిస్తున్నారు. తాజాగా అందుబాటులోకి తెచ్చిన 140 ట్రాక్టర్లతో అంతర్గత రహదార్లలో, మరో 40 వాహనాలతో ప్రధాన రహదార్ల వెంట చెత్త సేకరించి తరలిస్తున్నారు. నగరపాలక సంస్థకు చెందిన 25 సీఎన్‌జీ వాహనాలతో కొండ ప్రాంతాల్లో చెత్త సేకరిస్తున్నారు.

విద్యుత్తు ఉండని ప్రాంతాలు నేడు

కరెన్సీనగర్: తీగల మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు వరలక్ష్మినగర్, ఎల్ఐసీ కాలనీ, ప్రశాంతి నగర్, జయప్రకాశ్‌నగర్, ఫిల్మ్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారి పి.హరిబాబు తెలిపారు.

నీటి సరఫరా నిలిపివేత

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడా మైదానం ప్రాంగణంలోని రిజర్వాయర్‌కు అనుబంధమైన అంతర్గత కనెక్షన్ల సమస్యను పరిష్కరించేందుకు ఈ నెల 24వ తేదీ సాయంత్రం నుంచి 25వ తేదీ వరకు నగరంలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు పరిధిలోని 7, 8, 19 డివిజన్లలో బాడవపేట, నెహ్రూనగర్, మొగల్రాజపురం, నవోదయ కాలనీ, జర్నలిస్టు కాలనీ, పీవీపీ రోడ్డు, డింపుల్ బార్ రోడ్డు, వర మహాలక్ష్మిరోడ్డు, మల్లెల పరమేశ్వరరావు రోడ్డు, ఉడ్‌పేట, మెరక ఉడ్‌పేట, శాంతి నగర్, మధు గార్డెన్, రెల్లిస్ బజార్, లబ్బీపేట, పైడియ్య వీధి, వెంకటేశ్వరస్వామి గుడి రోడ్డు, తూర్లపాటి కుటుంబరావు రోడ్డు, గొరయ్య వీధి, నేతాజీ బ్రిడ్జి రోడ్, కృష్ణానగర్, లక్ష్మీనగర్, గౌస్ వీధి, మజీద్ వీధి, గ్రీన్‌ల్యాండ్ వీధి, చంద్రమౌళీపురం, గాయత్రినగర్, కంచుకోటబజార్, ఓల్డ్ 5వ నెంబరు రూట్, అశోక్‌నగర్, రామచంద్రనగర్, బ్యాంకు కాలనీ-1, 2, రెవెన్యూ కాలనీ, టిక్కిల్ రోడ్డు, మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీ, శ్యామ్‌నగర్, సిద్ధార్థ నగర్, బృందావన్ కాలనీ ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు వెల్లడించారు.

వక్తృత్వ పోటీలో ప్రతిభ

లబ్బీపేట(విజయవాడ సిటీ): సిద్ధార్థ మహిళా కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మోల్ దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోల్ భావన అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రిన్సిపల్ ఎస్.కల్పన బహుమతులు అందజేశారు. కళాశాల ప్రత్యేకాధికారి ఆర్.మాధవి, రసాయన, భౌతిక శాస్త్ర విభాగాధిపతులు ఎం.సుభాషిణి, ఎం.గీతామాధురి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభాస్ జన్మదినం

కృష్ణలంక, న్యూస్‌టుడే: సినీ నటుడు ప్రభాస్ జన్మదినాన్ని ఆయన అభిమానులు బుధవారం కృష్ణలంక నిర్మల శిశుభవన్‌లో ఘనంగా నిర్వహించారు. తెదేపా యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ కార్యక్రమానికి హాజరై కేకు కత్తిరించి చిన్నారులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ప్రభాస్ అభిమానులు పోడూరు పవన్, పి.నరసింహ, చింతపల్లి వంశీ, నిమ్మకూరు కృష్ణ, రవి, మురళీ పాల్గొన్నారు.

నూతన భవనాలకు ఆస్తి పన్ను విధించాలి



అధికారులతో సమీక్షిస్తున్న ధ్యానచంద్ర, సృజన

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని నూతన భవనాలను గుర్తించి ఆస్తి పన్ను విధించి వసూలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మూడు సర్కిళ్ల రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ రెవెన్యూ సెక్రటరీలు, క్షేత్ర స్థాయి సిబ్బందితో ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో అదనపు ఫ్లోర్ల నిర్మాణాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి వాటికి కూడా ఆస్తి పన్ను విధించి వసూలు చేయాలని అన్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి పన్ను విధించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా నిర్మాణాలను గుర్తించి పన్నులు విధించి నగరాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. నీటిపన్ను వసూలు చేసే విషయంలో ఇంజినీరింగ్ అధికారులతో రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. అధికారులు జి.సృజన, జి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

కూలిన గోడ నిర్మించాలి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని సూర్యారావుపేట కమలా నెహ్రూ ఉమెన్స్ హాస్టల్, మహిళా శిశుబాల సంక్షేమ సదన్ ప్రహరీని వెంటనే పునఃనిర్మించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఇటీవల కూలిపోయిన హాస్టల్ ప్రహరీని ఆయన బుధవారం పరిశీలించారు. ప్రహరీ తిరిగి నిర్మించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందున పనులు వేగంగా చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు. హాస్టల్‌లోని వారికి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు జీవీజీఎస్‌వీ ప్రసాద్, పి.సత్యనారయణ, జి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక నైపుణ్యాల పెంపుతో ప్రయోజనం



మాట్లాడుతున్న విద్యాకన్నా, పక్కన పూర్ణిమ

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : వృత్తి విద్య నేర్చుకునే శిక్షణార్థులు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుంటేనే వ్యాపార, పారిశ్రామిక రంగంలో రాణిస్తారని జనశిక్షణ సంస్థాన్ ఛైర్‌పర్సన్ ఎన్.విద్యాకన్నా అన్నారు. మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని కార్యాలయంలో 'మహిళలతో పరిశ్రమల స్థాపన-ప్రాముఖ్యత' అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీ రుణాలతో దుకాణాలు, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. తమ దగ్గర శిక్షణ తీసుకున్న ఎంతో మంది వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో స్థిరపడ్డారని తెలియజేశారు. డైరెక్టర్ ఎ.పూర్ణిమ మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను స్ఫూర్తిగా తీసుకొని, అందుబాటులోని అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు.

బందరు రోడ్డు విస్తరణ పనుల్లో కదలిక



పటమట, న్యూస్‌టుడే: చెక్‌పోస్టు సెంటర్ నుంచి బెంజ్‌సర్కిల్ వరకు బందరు రోడ్డు విస్తరణ పనులను వీఎంసీ అధికారులు బుధవారం ప్రారంభించారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించగా... తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులను అధికారులు ప్రారంభించారు. న్యాయస్థానంలో ఉన్న స్థలాలు మినహా నష్టపరిహారం తీసుకున్న స్థలాల వద్ద రోడ్డు వెడల్పు చేస్తున్నారు. తొలుత డ్రెయినేజీ నిర్మించిన అనంతరం రోడ్డు పనులు ప్రారంభించే అవకాశం ఉంది. మరోవైపు వ్యాపారులు ఒక వారం సమయం కావాలని వీఎంసీ అధికారులను అడగ్గా... నిరాకరించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ పనులు పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు.

ముందస్తు జాగ్రత్తలతో దొంగతనాల నివారణ

గుణదల(పటమట), న్యూస్‌టుడే: ముందస్తు జాగ్రత్తలతో దొంగతనాలు జరగకుండా నివారించవచ్చని క్రైమ్ ఏడీసీపీ రాజారావు అన్నారు. బుధవారం మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ అండ్ వెటర్నరీ కాలనీ పార్కులో పరిసర ప్రాంతాల ప్రజలకు దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. రాజారావు మాట్లాడుతూ.. ఊరు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇచ్చి ఎల్‌హెచ్‌ఎంఎస్‌ని ఉపయోగించాలని తెలిపారు. సీఐ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దిగువకు కొమ్మలు.. ఎలా రాకపోకలు



కిందికి వాలిన చెట్టు కొమ్మలతో రహదారిపై రాకపోకలు కొనసాగించే ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎనిమిదో డివిజన్ గాయత్రినగర్‌లోని ఆచార్య రంగా రోడ్డులో ఓ చెట్టు కొమ్మలు కిందికి వాలిపోయాయి. అందులో ఒకటి విరిగి వేళాడుతోంది. అటుగా వెళ్లే ద్విచక్రవాహన చోదకులు, ఇతర వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆ కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

ఐలా.. నియంత్రికలు ఇలా!



కాటా రోడ్డులో పరిస్థితి ఇదీ

ఆటోనగర్ వివరాలు	(సుమారు)
మొత్తం కార్మికులు	– 80 వేలు
పరిశ్రమలు	– 3500
నియంత్రికలు	– 200
అడుగు ఎత్తులోపువి	– 30
రక్షణ కంచె లేనివి	– 100
ఫ్యూజ్ బాక్సులు లేనివి	– 60
పిచ్చి తీగలు అల్లుకున్నవి	– 30



సన్‌లైట్ సెంటర్ రోడ్డు చివరన కనిపించని నియంత్రిక

ఆటోనగర్, న్యూస్‌టుడే

విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం.. ఐలా పర్యవేక్షణ లోపం.. కార్మికుల్లో అవగాహన లేమి తదితర కారణాల వల్ల ఆటోనగర్‌లో నియంత్రికలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వాటి చుట్టూ రక్షణ కంచెలు లేవు. చెత్త పేరుకుపోయింది. కంప చెట్లు పెరిగిపోయాయి. కార్మికులు భయం భయంగా గడుపుతున్నారు. పరిశ్రమల నిర్వహణ కోసం ఆటోనగర్ ఏర్పడిన కొత్తలో విద్యుత్తు సరఫరా కోసం నియంత్రికలు ఏర్పాటు చేశారు. అందులో 70 శాతానికి పైగా నియంత్రికలకు రక్షణ కంచెలు లేవు. మెకానిక్ షెడ్ నిర్వాహకులు సైతం వాటి పరిసర ప్రాంతాల్లో వాహనాల విడిభాగాలు పెడుతున్నారు. మరి కొన్నిచోట్ల నరికేసిన చెట్ల కొమ్మలు వేస్తున్నారు. చెత్త తొలగించకుండా అక్కడే తగలబెడుతున్నారు. గడిచిన 50 ఏళ్లలో రోడ్ల ఎత్తు దాదాపు ఆరు అడుగులు పెరిగింది. అందుకు అనుగుణంగా దిమ్మల ఎత్తు పెంచకపోవడంతో చాలా చోట్ల కేవలం రెండు అగుడుల ఎత్తులోనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఆటోనగర్ పాలనంతా.. ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) ద్వారా జరగాలి. కానీ ఐలా అధికారులకు పర్యవేక్షణ కొరవడింది. ఈ సమస్యను ఐలా దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదాలు జరగకముందే స్పందించాలని కోరుతున్నారు.

మురుగు తొలగించారు



గుణదల (పటమట), న్యూస్‌టుడే: క్రీస్తురాజపురంలోని జయప్రకాశ్ నగర్ వద్ద మురుగు సమస్యపై బుధవారం 'ఈనాడు'లో 'వరద కాదు మురుగే' శీర్షికతో ప్రచురితమైన కథనానికి వీఎంసీ అధికారులు స్పందించారు. కాలువలో పూడిక తీయించి మురుగు తొలగించారు. తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం తవ్విన గుంతను పూడ్చి వేసి బ్లీచింగ్ చల్లారు. రోడ్డుపై పెట్టిన డంపర్లు తొలగించి పక్కన ఏర్పాటు చేశారు.

ఈనాడు కథనానికి స్పందన

ఎర్తింగ్‌తో విద్యుత్తు ప్రమాదాల నివారణ

ఆటోనగర్: ఎర్తింగ్ సిస్టంతో పరిశ్రమల్లో విద్యుత్తు ప్రమాదాలు నివారించవచ్చని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) విజయవాడ ఛైర్మన్ డి.వి రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం ఆటో నగర్‌లోని ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ. ఇండస్ట్రీస్ అసోసియేషన్ హాల్‌లో 'బెస్ట్ ఎర్తింగ్ ప్రాక్టీసెస్'పై వర్క్‌షాపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్‌లో భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్ట నివారణకు సరైన ఎర్తింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని పునరుద్ఘాటించారు. నారాయణ ప్రసాద్ ఎలక్ట్రికల్ వర్క్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ మలినేని నారాయణ ప్రసాద్, ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాయన వెంకట్రావు, శాస్త్రవేత్త సాయి కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

ఆటోనగర్, న్యూస్‌టుడే: ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్టు మహిళా ఉద్యోగి మరియమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంకకు చెందిన ఎం.మరియమ్మ ఆటోనగర్ ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఆమెకు భర్త, ముగ్గురు కుమార్తెలున్నారు. మంగళవారం రాత్రి డిపోలో జరిగిన బస్సు ప్రమాదంలో మరియమ్మ కుడి కాలికి బలమైన గాయమైంది. డిపో సిబ్బంది ఆమెను వెంటనే మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

ఆటోనగర్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం ఆటోనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం ఆటోనగర్ విజయ్ ఎంటర్‌ప్రైజెస్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించగా ఆ వ్యక్తి మరణించినట్లు గుర్తించారు. అతని వయసు సుమారు 50 ఏళ్లు ఉండవచ్చని, సిమెంట్ రంగు టీషర్టు, కాకీ రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

జూడో క్రీడాకారుల ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తిలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల జూడో పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు పతకాలు సాధించడంతో పాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుందని కోచ్ శ్రీను తెలిపారు. ఎం.కీర్తన పసిడి, బి.భావన పసిడి, ఎస్.లక్ష్మణ్‌కుమార్ పసిడి, అలెక్సా పసిడి, ఎస్కే అజీజ్ రెహమాన్ కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. బుధవారం ఐజీఎంసీ స్టేడియంలో క్రీడాకారులను, కోచ్ శ్రీనుని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ అభినందించారు.

పవర్ లిఫ్టర్‌కు అభినందన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలకు చెందిన పవర్ లిఫ్టర్ టీడీవీఎం సతీష్ జిల్లా స్థాయి ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటాడని ప్రిన్సిపల్ ఆచంటి సునీత తెలిపారు. ఈ నెల 20వ తేదీన కేసరపల్లిలో నిర్వహించిన పోటీలో సతీష్ పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడని పేర్కొన్నారు. బుధవారం సతీష్, పీడీ వినయ్ శేఖర్‌ని అభినందించారు.

ఉత్సాహంగా ఫిడే ఇంటర్నేషనల్ చెస్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న బీఎన్ కేయూ ఫిడే ఇంటర్నేషనల్ చెస్ టోర్నీలో బుధవారం నాలుగు రౌండ్లు ముగిసే సరికి నాలుగు పాయింట్లతో పలువురు క్రీడాకారులు ముందంజలో కొనసాగుతున్నారు. నాలుగో రౌండ్‌లో రెండో బోర్డుపై పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ కౌత్సవ్ కుండు(2429), తమిళనాడుకు చెందిన రాజు ఎస్(1872) మధ్య పోటీ ఉత్కంఠభరితంగా సాగింది. కౌత్సవ్ కుండు విజయం సాధించాడు. రాష్ట్రానికి చెందిన ఫిడే మాస్టర్ ఆదిత్య వరుణ్ గంప(2194), జ్ఞాన సాయి సంతోష్(2078), తెలంగాణకు చెందిన ఫిడే మాస్టర్ మట్టా వినయ్‌కుమార్(2159) నాలుగు పాయింట్లతో ముందంజలో కొనసాగుతున్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలో ప్రథమ స్థానం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఇటీవల నిర్వహించిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఫార్మాడీ చదువుతున్న టీడీవీఎం సతీష్ ప్రథమ స్థానంలో నిలిచారని ఫిజికల్ డైరెక్టర్ ఎల్.వినయ్‌శేఖర్ తెలిపారు. సతీష్‌ను బుధవారం ప్రిన్సిపల్ ఆచంటి సునీత అభినందించారు.

గ్రాండ్‌మాస్టర్ లలిత్‌బాబుకు మంత్రి ప్రశంస



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరానికి చెందిన గ్రాండ్‌మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్ బాబును రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి అభినందించారు. ఇటీవల థాయ్‌లాండ్‌లో జరిగిన పట్టాయ శ్రీరాచా ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్-2024లో లలిత్‌బాబు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకున్నాడు. బుధవారం లలిత్‌బాబు తన తల్లి పద్మకుమారితో కలిసి మంత్రిని నగరంలోని ఆయన విడిది కార్యాలయంలో కలిశారు.

బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ (ఐఏ అండ్ ఏడీ) శాఖ సౌత్ జోన్ బ్యాడ్మింటన్ టోర్నీ స్థానిక డీఆర్ఆర్ఎంసీ ఇండోర్ స్టేడియంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏజీ కార్యాలయానికి టోర్నీ కేటాయించడం గర్వకారణమన్నారు. ముందుగా ఆయన జ్యోతి వెలిగించి పోటీ ప్రారంభించారు. డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ పి.కిషోర్‌రెడ్డి, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ జితేంద్ర నాథ్‌శర్మ, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ నిఖిల పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా క్రీడా జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో బుధవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-19 బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, జూడో క్రీడాంశాల్లో ఉమ్మడి కృష్ణాలోని క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ జిల్లా శాఖ కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. వారిని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ అభినందించారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్లకు వారు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

ప్రతిభా పాటవ పోటీలో రాణింపు


వ్యాసం రాస్తున్న విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందజేసిన ప్రిన్సిపల్

నందిగామ గ్రామీణం: నందిగామ ఎంజెహెచ్ పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీహెచ్.తేజస్ (పదో తరగతి) ప్రథమ, ఎస్‌కే సల్మా (పదో తరగతి) ద్వితీయ, యు.ఇంద్రజ (ఎనిమిదో తరగతి) తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రధానోపాధ్యాయిని ఇ.మోని అందజేశారు. ఉపాధ్యాయులు కె.చలపతిరావు, బి.రామారావు పాల్గొన్నారు.

25 నుంచి గ్రామసభలు

చందర్లపాడు, న్యూస్‌టుడే: భూముల రీసర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో అభ్యంతరాలపై ఫిర్యాదులు స్వీకరించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పాల్ బుధవారం తెలిపారు. ఈ నెల 25న పాటింపాడు, 26న వెలది, 27న మేడిపాలెం రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు. అభ్యంతరాలపై రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదులు తీసుకుంటారని తెలిపారు.

హత్యాయత్నంపై కొనసాగుతున్న విచారణ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటకు చెందిన భాజపా నాయకుడు నోముల రఘుపై హత్యాయత్నం, దాడి ఫిర్యాదుపై విచారణ కొనసాగుతుందని సీఐ జానకిరాం తెలిపారు. గుర్తుతెలియని దుండగుల ఆనవాళ్లను గుర్తించామని, వారి ఆచూకీ కోసం గాలిస్తున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఆయన కుమారుడు వెంకటకృష్ణ ప్రసాద్‌లపై అనుమానం వ్యక్తం చేయడంతో ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సీసీ కెమెరాల ద్వారా ఘటనలో వాడిన కారును గుర్తించి దాని ద్వారా నిందితుల ఆనవాళ్లను గుర్తించగలిగామని, వారిని అదుపులోకి తీసుకొని ఇందులో ఇంకా ఎవరెవరి హస్తం ఉందనేది నిర్ధారించాల్సి ఉందన్నారు.

నిద్రించే చోటే చదువు

గిరిజన గురుకులానికి సొంత భవనం కరవు
స్థల సేకరణకు తొమ్మిదేళ్లుగా నిరీక్షణ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు సొంత భవనం కల్లేదు. ఇరుకు గదుల్లో చదువుకోడానికి అవస్థలు పడుతున్నారు. తొమ్మిదేళ్లుగా సొంత భవనం నిర్మించడానికి స్థల సేకరణ చేస్తూనే ఉన్నారు. నిద్రించే చోట చదువుకోవాల్సి రావడంతో బాలికలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. మరుగుదొడ్లు సరిపోక కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో స్థల సేకరణ గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా తమ కష్టాలు తీర్చాలని గిరిజన బాలికలు కోరుతున్నారు.


నందిగామ గిరిజన బాలికల గురుకుల పాఠశాల


సామగ్రివద్ద కూర్చొని చదువుకుంటున్న విద్యార్థినులు

196 మంది...

★ నందిగామ నెహ్రూ నగర్‌లో 2016లో గిరిజన బాలికల గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారు. అప్పట్లో గిరిజన వసతి గృహాన్ని గురుకుల పాఠశాలగా మార్పు చేశారు.

★ ప్రస్తుతం ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి వరకు 196 మంది బాలికలు చదువుతున్నారు. * నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను నాణ్యమైన చదువు కోసం ఈ పాఠశాలలో చేర్పించారు. అయిదు డార్మెటరీలు, మూడు తరగతి గదులు ఉన్నాయి.

★ తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు తాము నిద్రించే గదిలోనే పుస్తకాల సంచులు, దుస్తులు, సామగ్రి ఉంచుకుంటున్నారు. ఆ మధ్యే చదువుకోవడానికి అవస్థలు పడుతున్నారు.

★ ప్రస్తుతం 39 మంది బాలికలు పదో తరగతి చదువుతున్నారు. వారికి సరైన సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. నాలుగు స్నానాల గదులు, నాలుగు మరుగుదొడ్లు ఉన్నాయి. అవి సరిపడక బాలికలు ఉదయం, సాయంత్రం స్నానాలు, కాలకృత్యాలకు ఇబ్బంది పడుతున్నారు.

★ సైన్స్, గణితం ఉపాధ్యాయులు లేక పిల్లలు నష్టపోతున్నారు.

స్థలం పరిశీలించి..

■ గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించడానికి రామవరపురం కొండ వద్ద నాలుగు ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. తొమ్మిదేళ్ల కిందట స్థల సేకరణ దస్త్రం రెవెన్యూ శాఖ కలెక్టర్ కార్యాలయానికి పంపించారు.

■ స్థల సేకరణ చేస్తే సొంత భవనం నిర్మించడానికి గిరిజన సంక్షేమ శాఖ నిధులు మంజూరు చేస్తుంది. కేవలం స్థల సేకరణలో జాప్యం వల్ల భవనం నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

■ కూటమి ప్రభుత్వంలో అధికారులు దృష్టిపెడితే సమస్య పరిష్కారం అవుతుందని విద్యార్థినులు, తల్లిదండ్రులు భావిస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

❖ పట్టణంలోని నెహ్రూ చౌక్‌లో తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానిక వ్యాపారులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా చేసిన ఫిర్యాదుపై ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ స్పందించారు. ట్రాఫిక్ రద్దీ సమయాల్లో సిబ్బందిని నియమించి వాహనాలు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు.

❖ పట్టణంలోని ముఖ్యాల రోడ్డులో పేరుకుపోయిన చెత్త వల్ల దుర్వాసన, దోమల బెడద పెరుగుతుందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా ఇచ్చిన ఫిర్యాదుపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంబటి రాంబాబు స్పందించారు. ప్రత్యేకంగా వాహనం, సిబ్బందిని పంపి అక్కడి సమస్యను పరిష్కరించారు.

❖ పట్టణానికి చేరువలో జాతీయ రహదారి సమీపంలో విద్యుత్తు లైన్లకు అవరోధంగా మారిన చెట్ల వల్ల పొంచి ఉన్న ప్రమాదంపై స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా ఫిర్యాదు చేయడంతో ఏడీఈ శ్రీనివాసరావు స్పందించారు. పలు చోట్ల చెట్ల కొమ్మల్ని నరికించి సమస్యకు తాత్కాలిక పరిష్కారం చూపారు. - **న్యూస్‌టుడే, జగ్గయ్యపేట**

రహదారి నిర్మాణంపై ఎమ్మెల్యే స్పందించాలి

కంచికచర్ల, న్యూస్‌టుడే : కంచికచర్ల - జుజ్జూరు రహదారి గోతులతో అధ్వానంగా మారిందని, ఆ రోడ్డు నిర్మాణంపై ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పందించాలని ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్‌కిరణ్ డిమాండ్ చేశారు. రహదారి దుస్థితిపై ఎమ్మెల్యేకు బుధవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ప్రతిపక్షంలో ఉండగా ప్రస్తుత ఎమ్మెల్యే సౌమ్య, తెదేపా నాయకులు రహదారి దుస్థితిపై ఆందోళనలు చేశారని, ఇప్పుడు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. నిత్యం వందల మంది ప్రయాణికులు, వాహనాలతో రద్దీగా ఉండే రహదారిని వెంటనే పునర్నిర్మించాలని అన్నారు.

ఉదయభానుపై ఫిర్యాదు కుట్రపూరితం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: దాడి ఘటనకు జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను బాధ్యుడని నోముల రఘు ఇచ్చిన ఫిర్యాదు పూర్తిగా కుట్రపూరితమని మున్సిపల్ వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకర్ సహా జనసేనలో తాజాగా చేరిన నాయకులు ఆకుల బాజీ, కాశీకిశోర్, షేక్ సత్తార్, ఖాదర్‌బాబు తదితరులు విమర్శించారు. జగ్గయ్యపేటలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. నోముల రఘు అనేక మందిపై ఫిర్యాదు చేసి బ్లాక్‌మెయిల్ చేశారని, ఆయన వల్ల నష్టపోయినవారు ఎవరో చేసిన పనిని రాజకీయ దురుద్దేశంతో కొందరు ఉదయభాను ప్రతిష్ఠకు భంగం కలిగించాలని చూస్తున్నారన్నారు.

రఘు భాజపా కార్యకర్తననడం ఆక్షేపణీయం

జగ్గయ్యపేట: నోముల రఘుపై బుధవారం జరిగిన దాడిని తాము ఖండిస్తున్నామని పట్టణ పార్టీ అధ్యక్షుడు గోలి రాఘవ, జిల్లా కిసాన్‌మోర్చా కార్యదర్శి యాపోగు రాజాలు పేర్కొన్నారు. జగ్గయ్యపేటలో వారు మీడియాతో మాట్లాడుతూ నోముల రఘు 2021లోనే భాజపా సభ్యత్వానికి రాజీనామా చేస్తూ లేఖ పంపారని, తిరిగి ఇప్పుడు భాజపా కార్యకర్తనని పేర్కొనడం ఆక్షేపణీయమని పేర్కొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ

వత్సవాయి, న్యూస్‌టుడే: వత్సవాయిలో శిర్డీ సాయి ఆలయ ప్రారంభంలో భాగంగా చేపట్టిన పూజా కార్యక్రమాలు బుధవారం కొనసాగాయి. ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలకు రుత్వికులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నందిగామ: వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బాధితులకు పంపిణీ చేశారు. కాకానినగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం 22 మందికి రూ.13 లక్షల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వైద్యానికి సీఎం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. నాయకులు వాసిరెడ్డి ప్రసాదు, షేక్ ఖాజా, ఉన్నం నరసింహారావు, దాములూరు మధుసూదనరావు, యేచూరి రామకృష్ణ, తొర్లికొండ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

రూ.17 కోట్ల ఉపాధి నిధులతో అభివృద్ధి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు రూ.17 కోట్లతో అభివృద్ధి పనులకు అవకాశం లభించిందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. ఆయన తన కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. 40 కి.మీ సిమెంట్‌రోడ్డు, 10 కి.మీ డ్రెయిన్ నిర్మాణాలను మరో మూడు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కె.నరసింహారావు, వి.రాంబాబు, వై.గోపీచంద్, కె.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు: ఈనెల 26 నుంచి జరగబోయే తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య వివరించారు. రూ.5 లక్షల బీమా సౌకర్యంతో కూడిన సభ్యత్వ నమోదుపై ప్రజల్లో అవగాహన కల్పించి పార్టీని మరింత బోలపేతం చేసే దిశగా నాయకులు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం కోసం అవసరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అర్హులంతా ఓటుహక్కు కోసం అర్జీ పెట్టుకునేలా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'బద్వేల్ ఘటన నిందితుడిని శిక్షించాల్సిందే'

నందిగామ, న్యూస్‌టుడే: వైఎస్ఆర్ జిల్లా బద్వేల్‌లో బాలికపై అత్యాచారం చేసి.. ఆపై కిరోసిన్ పోసి హత మార్చిన వ్యక్తిని వెంటనే శిక్షించాలని ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. నందిగామలో బుధవారం రాత్రి ఘటనను నిరసిస్తూ.. ప్రజా సంఘాల నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో షేక్ ఆజాద్, యరగొర్ల రామారావు, దంత వైద్యురాలు అంజలి, అంగడాల పూర్ణచంద్రరావు, కురగంటి హనుమంతురావు, వినుకొల్లు నవీన్‌బాబు, పత్తిపాటి సూర్యం తదితరులు పాల్గొన్నారు.


ప్రజాసంఘాల ప్రతినిధుల కొవ్వొత్తుల ప్రదర్శన

ఆలపాటి విజయానికి సమష్టి కృషి

కంచికచర్ల, న్యూస్‌టుడే : కూటమి తరఫున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఘన విజయం అందించేలా తెదేపా శ్రేణులు సమష్టి కృషి చేయాలని మండల అధ్యక్షుడు కోగంటి బాబు అన్నారు. స్థానిక తెదేపా మండల కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై తెదేపా నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రజల సంక్షేమం కోసం ఆలపాటి నిరంతరం తపించే వ్యక్తి అని అన్నారు. తెదేపా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని తెలిపారు. గ్రాడ్యుయేట్‌లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. తెదేపా నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గండ్రాయి జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ శిక్షకుడు వై.గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలంటే విద్యార్థి దశ ఎంతో కీలకమైందని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి.. అధ్వానంగా మారి



కీసర టోల్‌ప్లాజాకు సమీపంలో విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి చెత్త, కొబ్బరి బొండాల వ్యర్థాలతో అధ్వానంగా మారింది. నిత్యం వేలాది వాహనాలు, జనం రాకపోకలు సాగించే రహదారిపై ఎవరికి వారు వ్యర్థాలు వేస్తున్నారు. దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కీసర టోల్‌ప్లాజా వద్ద హైవే నిర్వహణ సంస్థ కార్యాలయానికి దగ్గర్లోనే అధ్వానంగా ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. హైవే అథారిటీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు. - **నందిగామ, న్యూస్‌టుడే**

మద్యం దుకాణం తొలగించాల్సిందే

కంచికచర్ల, న్యూస్‌టుడే : నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలకు సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలంటూ స్థానికులు బుధవారం ఆందోళన నిర్వహించారు. నివాసాల మధ్య దుకాణం ఏర్పాటు చేయడం సరి కాదని అన్నారు. సమస్యపై ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇచ్చామని, కానీ అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణం తొలగించే వరకు రోజూ నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.


విత్తనాల కొరత.. అన్నదాత కలత

కంచికచర్ల, వీరులపాడు - న్యూస్‌టుడే

కంచికచర్ల, వీరులపాడు మండలాల రైతులు రబీలో అత్యధికంగా శనగ సాగు చేస్తారు. స్వల్ప కాలిక పంట కావడంతో శనగ పండించడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది సాగుకు రైతులు పొలాలు తయారు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. కానీ సరిపడా విత్తనాలు అందుబాటులో లేవు. సాగు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విత్తనాలు దొరుకుతాయా? లేదా? అని ఆందోళన చెందుతున్నారు.

ధరల వివరాలు (రూ.ల్లో)

క్వింటా శనగ విత్తనాలు	: 9400
ప్రభుత్వం అందించే రాయితీ	: 2350
రైతు చెల్లించాల్సిన సొమ్ము	: 7050



సమీపిస్తున్న సమయం

ఏటా ప్రభుత్వం రైతులకు రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తుంది. ఈ ఏడాది సైతం వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు సిద్ధంగా ఉంచినప్పటికీ, అవి రైతులకు సరిపోకపోవడం, సాగు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న ధర, బహిరంగ మార్కెట్‌లో ధర ఇంచుమించు సమానంగానే ఉన్నప్పటికీ ప్రభుత్వం సరఫరా చేస్తున్న విత్తనాలు నాణ్యమైనవిగా రైతులు భావిస్తున్నారు. అందుకే అందరూ వాటి కోసం ఎదురు చూస్తున్నారు.

వీరులపాడు మండలంలో..

గత ఏడాది విత్తనాల సరఫరా	: 650 క్వింటాళ్లు
ఈ ఏడాది అవసరం	: 1160 ,,
ఇప్పటివరకు వచ్చినవి	: 650 ,,

ఎమ్మెల్యేకు ఫిర్యాదు

విత్తనాల కొరతపై ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు రైతులు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రితో చర్చించినట్లు ఆమె తెలిపారు. త్వరలోనే విత్తనాలు అందుబాటులోకి రావచ్చునని అధికారులు తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి జోగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ ఏడాది పంట విస్తీర్ణం అనూహ్యంగా పెరిగిందని, ప్రతిపాదనల మేరకు విత్తనాలు రాగానే రైతులకు అందిస్తామని తెలిపారు.

దిశ కమిటీ జిల్లా సభ్యురాలిగా కళావతి

నందిగామ గ్రామీణం: జొన్నలగడ్డ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మన్నె కళావతి దిశ కమిటీ జిల్లా సభ్యురాలిగా ఎంపికయ్యారు. ఉత్తర్వులను బుధవారం ఆమెకు మండల పరిషత్తు కార్యాలయ ఉద్యోగులు అందజేశారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

నందిగామ గ్రామీణం: నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం డివిజన్లోని ఉపాధ్యాయులకు పదో తరగతిలో మారిన సిలబస్‌పై శిక్షణ తరగతులు ప్రారంభించారు. తొలిరోజు తెలుగు పండితులకు రిసోర్సుపర్సన్లు శిక్షణ ఇచ్చారు. ప్రశ్నాపత్రాలు రూపొందించడంపై అవగాహన కల్పించారు. స్థానిక డీవైఈవో ఎం.వెంకటప్పయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు మారిన సిలబస్‌ను అవగాహన చేసుకుని విద్యార్థులకు అర్థవంతంగా పాఠాలు బోధించాలని సూచించారు. ఈనెల 30వ తేదీ వరకు తరగతులు నిర్వహించనున్నారు. తెలుగు పండితులు జానకి, కృష్ణారావు, ఆర్.రమేష్‌కుమార్, పీవీ సురేష్ రిసోర్సుపర్సన్లుగా వ్యవహరించారు. ఎంఈవో-2 ఎం.పద్మ, ప్రధానోపాధ్యాయిని పి.విజయలక్ష్మి, శిక్షణ తరగతుల కోఆర్డినేటర్ ఆర్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి చెత్త నుంచి సంపద కేంద్రాలు

కంచికచర్ల, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి పి.లావణ్య కుమారి అధికారులకు సూచించారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఏడు మండలాల ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగానికి అనువుగా సిద్ధం చేయాలని అన్నారు. ఇంటి పన్ను వసూళ్లపై అధికారులకు సూచనలు చేశారు. పీఆర్-వన్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. పరిటాలలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. డీఎల్‌పీవో మన్నె ప్రసాద్, కంచికచర్ల ఎంపీడీవో లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు విద్యార్థి ఎంపిక

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 22న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ సెలక్షన్‌లో గండ్రాయికి చెందిన సాధనాల నాగరాజు ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైదులు, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. అంతర్ జిల్లా కబడ్డీ పోటీలు అనంతపురంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉచిత ఇసుక విధానం హర్షణీయం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడం ద్వారా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చేశారని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. నూతన విధానంపై హర్షం వ్యక్తం చేస్తూ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు నీలకంఠం ప్రసాద్ ఆధ్వర్యంలో మినీబైపాస్ రోడ్డు కూడలి వద్ద బుధవారం ఆయన కార్మికులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. పేదలకు కడుపు నింపే విధంగా అన్న క్యాంటీన్లను పునరుద్ధరించడం, గత ప్రభుత్వం రద్దు చేసిన ఉచిత ఇసుక విధానం తిరిగి నేడు పునరుద్ధరించడం పేదలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. కౌన్సిలర్లు ఎస్.బుజ్జి, జి.నాగరాజు, పి.సైదేశ్వరరావు, జి.వెంకట్రావు, ఎన్.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబు ఫొటోకి పాలాభిషేకం చేస్తున్న తాతయ్య

కార్మికుడి అనుమానాస్పద మృతి

నందిగామ, న్యూస్‌టుడే: అనాసాగరం గ్రామానికి చెందిన కారం మరియన్న(33) మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శాతకర్ణి వివరాల ప్రకారం.. మరియన్న మార్బుల్స్ పనులు చేస్తుంటారు. రెండు వారాల కిందట మరో వ్యక్తితో కలిసి మద్యం తాగే సమయంలో ఘర్షణ జరిగింది. తర్వాత ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఈనెల 21న చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో మార్బుల్స్ వేసే మిషన్ దించి నందిగామ వచ్చారు. అనంతరం ఫిట్స్‌లా వచ్చి అస్వస్థతకు గురికావడంతో నందిగామ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఈనెల 22న మళ్లీ తీవ్ర అస్వస్థతకు గురికాగా.. నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. బాధితుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూసర్వే తప్పులతడక

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాపురంలో నిర్వహించిన భూముల రీసర్వే తప్పుల తడకగా ఉందని రైతులు ఆరోపించారు. గ్రామంలో బుధవారం నిర్వహించిన సభకు హాజరైన రైతులు భూసర్వే తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వెంకటాపురం రెవెన్యూ పరిధిలో 1974 ఎకరాల్లో సర్వే చేయగా వాటిలో 1,300 ఎకరాలకు రైతు ఖాతాలు ఉన్నాయని తెలిపారు. రైతులు సర్వేలో తప్పిదాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పాత అడంగల్‌లో ఉన్న విస్తీర్ణానికి, సర్వే పూర్తయిన తర్వాత వచ్చిన 1బీ అడంగల్‌లో భూ విస్తీర్ణంలో తేడాలున్నాయని రైతులు తెలిపారు. భూములు రీసర్వే చేసేటప్పుడు అధికారులు తమకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. సాధారణంగా ఎకరానికి 5 సెంట్ల వరకు వ్యత్యాసం ఉండే అవకాశం ఉందని అధికారులు వివరించే ప్రయత్నం చేయగా చాలా మంది రైతులకు 30 నుంచి 40 సెంట్లు, కొందరికి ఎకరం వరకు వ్యత్యాసం రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 1300 ఖాతాలు ఉంటే 90 శాతం తప్పులున్నాయని రైతులు వాపోయారు. పాత రికార్డుల ప్రకారం భూమి విస్తీర్ణం ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. డీటీ భాస్కర్, ఆర్ఐ అబ్దుల్ హలీం, సర్వేయర్ స్వప్న, పాల్గొన్నారు.


వెంకటాపురంలో అధికారులను నిలదీస్తున్న రైతులు

ఎకరం భూమి తగ్గింది



వెంకటాపురం రెవెన్యూలో నాకు 2.80 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. భూముల రీసర్వే జరిగేటప్పుడు మాకు సమాచారం ఇవ్వకుండానే కొలతలు వేశారు. పూర్తయిన తర్వాత గత ప్రభుత్వంలో నాకు నోటీసు ఇచ్చారు. అప్పుడు 1.06 ఎకరాల విస్తీర్ణం తగ్గిందేంటని అధికారులను ప్రశ్నించగా రికార్డు సరి చేస్తాం కానీ మీ భూమి ఎవరికి వెళ్లిందో ఆ రైతును ఒప్పించాలన్నారు. ఆ భూమి ఏ రైతుకు వెళ్లిందో తెలియలేదు. బ్యాంకులో రుణాన్ని రీషెడ్యూల్ చేసుకునేందుకు ఇటీవల 1బీ అడంగల్ తీసి బ్యాంకులో ఇచ్చాను. పాత రికార్డులో 2.80 ఎకరాలు ఉంటే, కొత్త రికార్డులో 1.74 ఎకరాలే ఉండడంతో బ్యాంకు అధికారులు ఎకరం భూమి ఏమైందని ప్రశ్నించారు. ఇప్పుడు అధికారులను అడిగితే అర్జీ పెట్టుకోండి సరి చేస్తామంటున్నారు. - **రామకృష్ణ**

అర్జీల స్వీకరణ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: చందాపురం గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గతంలో రీసర్వే పూర్తయిన ఈ గ్రామంలో పొలం విస్తీర్ణాలు తగ్గుదలపై రైతులు అర్జీలు ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీరాములు, సర్వేయరు భోజ్యానాయక్, వీఆర్వో రాధా నాయకుడు ఉన్నం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా అరెస్ట్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సత్తుపల్లిలోని సబ్ డివిజన్ కార్యాలయంలో కల్లూరు ఏసీపీ ఏ.రఘు బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పెనుగంచిప్రోలుకు చెందిన ఎల్లబోయిన గోపితో పాటు అద్దంకి గురువయ్య, అద్దంకి శివ, ముంగి రాము, ముంగి కృష్ణ అలియాస్ కిట్టు, మరో మైనర్ కలిసి మంగళవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలపై వేంసూరు మండలం కందుకూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ చేసేందుకు రెక్కీ నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై వీరప్రసాద్ సిబ్బందితో వెళ్లగా.. వారిని చూసి నిందితులు పారిపోయేందుకు యత్నించగా. పట్టుకుని విచారించడంతో విషయం బయటపడింది.

☛ జల్సాలకు అలవాటుపడిన గోపి, మైనర్ కలిసి మధిర, వత్సవాయి, బోనకల్ పరిసర ప్రాంతాల్లోని దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడటంతో ఆయా ఠాణాల్లోనూ కేసులు నమోదై జైలు జీవితాన్ని గడిపారని తెలిపారు. వీరిద్దరూ అచ్చంపేటలోని సత్తెమ్మతల్లి, వెంకటాపురంలోని అంకమ్మతల్లి ఆలయాల్లో ఆగస్టులో చోరీలకు పాల్పడ్డట్లు చెప్పారు. నిందితుల నుంచి 3.3కిలోల వెండి, రూ.1.50లక్షల నగదు, బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్రవాహనాలు, చోరీలకు ఉపయోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పట్టణంలో రక్షిత మంచినీటి పైపులైన్లకు ఏర్పడిన లీకుల కారణంగా సరఫరా అవుతున్న మురుగునీటిపై మంగళవారం 'పైపులైను పగిలి.. తాగునీరు మురికి' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మంగళవారం లీకులు గుర్తించిన ఇంజినీరింగ్ అధికారులు బుధవారం పలుచోట్ల మరమ్మతు పనులు ముమ్మరంగా చేపట్టారు. ఒకేసారి ఆరు బృందాలుగా పట్టణ వ్యాప్తంగా సాగిన ఈ కార్యక్రమాన్ని కమిషనర్ రామ్మోహనరావు, డీఈ కలీముల్లా, ఏఈలు పర్యవేక్షించారు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సరఫరా అయ్యే నీటి నమూనాలతో పాటు ఆయా ప్రాంతాల్లో కుళాయిల నుంచి సరఫరా అయ్యే నీటి నమూనాలను కూడా సేకరించి గుంటూరుకు పరీక్షలకు పంపారు. రెండ్రోజుల్లో పూర్తి స్థాయిలో మరమ్మతులు పూర్తి చేస్తామని కమిషనర్ తెలిపారు.


నీటి నమూనాల సేకరణలో కమిషనర్ రామ్మోహనరావు

విజయవాడ పశ్చిమ

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు



వ్యాసం రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న పాఠశాల డైరెక్టర్ సూర్యారావు, ప్రిన్సిపల్ తులసి

చిట్టినగర్, న్యూస్‌టుడే: చిట్టినగర్‌లోని శ్రీగౌతమ్ హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు బుధవారం నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఆయా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో పి.తేజశ్విని (10వ తరగతి), కె.మేగమనోహర్ (9వ తరగతి), ఎస్.హారిక (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ ఎన్.సూర్యారావు, ప్రిన్సిపల్ తులసి బహుమతులు అందించి అభినందించారు.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



దాత ఇందుకూరి సత్యనారాయణకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేదపండితుడు



దాత బోను నాగమణికి విరాళం రసీదు అందజేస్తున్న సూపరింటెండెంట్ రాజు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి కైకలూరుకు చెందిన ఇందకూరి సత్యనారాయణ రూ.1,00,116, గుడివాడకు చెందిన నాగమణి రూ.1,00,116 విరాళాలను బుధవారం అందజేశారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం స్వర్ణతాపడం పనులకు అదనంగా రూ.1,00,116 విరాళాన్ని ఇచ్చారు. దాతల కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ రాజు, వేదపండితుడు వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

పాత శివాలయం హుండీ ఆదాయం రూ.4,40,851

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వన్‌టౌన్‌లోని శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం(పాత శివాలయం)లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం దేవస్థానం సిబ్బంది, సేవా కమిటీ సభ్యులు లెక్కించారు. 209 రోజుల్లో 27 హుండీల్లో కానుకలను లెక్కించగా రూ.4,40,851 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో నటరాజ్ షణ్ముఖం తెలిపారు. కానుకల లెక్కింపును దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్, పాలక మండలి ఛైర్మన్ బొమ్మ మధు, సభ్యులు పర్యవేక్షించారు.

ముందుకు సాగని అభివృద్ధి పనులు

నిలిచిన రెండో యాగశాల, ఆర్జిత సేవల కేంద్రం నిర్మాణం

దుర్గగుడిలో పూర్తికాని దసరా ఏర్పాట్ల తొలగింపు



యాగశాల పనులు ఇలా..

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే



పునాదులు దాటని ఆర్జిత సేవల భవనం



ఇంద్రకీలాద్రిపై తొలిగించని తాత్కాలిక షెడ్డు

దసరా ఉత్సవాలు ముగిసి పది రోజులు దాటినా తాత్కాలిక ఏర్పాట్లు తొలగించకపోవడం అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. రెండో యాగశాల, ఆర్జిత సేవల భవన నిర్మాణ పనులు దసరా ఉత్సవాల కారణంగా వాయిదా పడ్డాయి. కొద్ది రోజుల కిందట తాత్కాలిక ఏర్పాట్లు తొలగింపు పనులు ప్రారంభించారు. అవి నత్త నడకన సాగుతున్నాయి. దీంతో దుర్గమ్మ దర్శనం చేసుకునే భక్తులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. మంచి ముహుర్తాన్ని వైదిక కమిటీ సూచించడంతో యాగశాల పనులు పూర్తి కాకుండానే నెల రోజుల కిందట ప్రారంభించారు. కార్తిక మాసంలో నిత్యం చండీ యాగంతో పాటు రుద్రహోమం, సరస్వతీ, గణపతి యాగాలు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఉన్న ఒక్క యాగశాలలో పౌర్ణమి, పర్వదినాల సమయంలో భక్తులు చండీయాగం వీక్షించలేని పరిస్థితి ఉంది. దాత సంకా నరసింహారావు మల్లేశ్వరాలయ విస్తరణ పూర్తి చేసిన తరువాత యాగశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కనకదుర్గానగర్ నుంచి నిర్మాణ సామగ్రి వచ్చేందుకు అవకాశం లేకుండా ఒకవైపు దసరా తాత్కాలిక క్యూలైన్లు, మరోవైపు శాశ్వత ప్రసాదాల పోటు, అన్నప్రసాద భవనం, ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో యాగశాల నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతోంది.

రాజగోపుర ప్రాంగణంలో ఆర్జిత సేవలు

ఇంద్రకీలాద్రిపై ఆర్జిత సేవలు ప్రస్తుతం రాజగోపుర ప్రాంగణంలో శ్రీచక్రార్చన, లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణం సాధారణ రోజుల్లో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సమయంలో వీటిని మల్లికార్జున మహామండపంలో చేస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన ఆర్జిత సేవల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు ఆలయ అధికారులు భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పునాదుల వద్దే పనులు నిలిచిపోయాయి. దసరా ఉత్సవాల కోసం నెల రోజులుగా పనులు నిలపాల్సి వచ్చింది. నవంబరులో కార్తిక మాసంతో పాటు భవానీ దీక్షల స్వీకరణ, విరమణలకు వేలాది మంది భక్తులు తరలివస్తే అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుంది.

పనులు పూర్తి చేస్తాం

ఆర్జిత సేవల భవనం, యాగశాల పనుల విషయంపై దేవస్థానం ఈఈ కోటేశ్వరరావును సంప్రదించగా కార్తిక మాసం ప్రారంభమయ్యే నాటికి యాగశాల ఆర్జిత సేవల పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రసాదాల పోటు, అన్నదాన భవనం పనుల కారణంగా కొంత జాప్యం జరిగిందన్నారు. దసరా ఉత్సవాల తాత్కాలిక ఏర్పాట్లు తొలగించే పనులు వేగవంతం చేశామన్నారు.

నూతన భవనాలకు ఆస్తి పన్ను విధించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, డిప్యూటీ కమిషనర్(ఆర్) సృజన

విజయవాడ నగరపాలక సంస్థ: నగరంలోని నూతన భవనాలను గుర్తించి ఆస్తి పన్ను విధించి వసూలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం.ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మూడు సర్కిళ్ల రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ రెవెన్యూ సెక్రటరీలు, క్షేత్ర స్థాయి సిబ్బందితో ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో అదనపు ఫ్లోర్ల నిర్మాణాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి వాటికి కూడా ఆస్తి పన్ను విధించి వసూలు చేయాలని అన్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి పన్ను విధించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా నిర్మాణాలను గుర్తించి పన్నులు విధించి నగరాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. నీటి పన్ను వసూలు చేసే విషయంలో ఇంజినీరింగ్ అధికారులతో రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. అధికారులు సృజన, సామ్రాజ్యం పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేస్తే అత్యధిక మెజార్టీ

కష్టపడిన వారికి గుర్తింపు

ఎంపీ కేశినేని శివనాథ్



మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, వేదికపై తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: మనందరం చంద్రబాబు ఆస్తి అని, ఎలాంటి గ్రూపులు లేకుండా పని చేద్దామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పాలఫ్యాక్టరీ 'వి' కన్వెన్షన్‌లో పశ్చిమ నియోజకవర్గ తెదేపా విస్తృత స్థాయి సమావేశం, కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల నమోదు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పశ్చిమంలోని కార్యకర్తల ఆర్థిక పరిస్థితి ఏ ఒక్కరిది బాగోలేదన్నారు. చిరు వ్యాపారం చేసుకునే పార్టీ కార్యకర్తలను ఆదుకునేందుకు ఒక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. పని చేసిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందని, మిగతా నియోజకవర్గంలో మాదిరిగానే ఇక్కడ కూడా సమంగానే పదవులు వస్తాయని, సమన్వయం పాటించాలన్నారు. తాను పోటీ చేసిన ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ ఇచ్చారని, వారికి ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తున్నారని, ఆయనకు అత్యధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ ఓటు నమోదు చేయించుకునేవారు తప్పక 10వ తరగతి, ఇంటర్మీడియట్ రెండేళ్లు, డిగ్రీ 3 ఏళ్లు పూర్తి చేసిన వారు మాత్రమే పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థిని ఎన్నుకునేందుకు ఓటర్లుగా పరిగణిస్తారన్నారు. ఆన్‌లైన్‌లో గానీ, తహసీల్దార్ వద్ద గానీ నమోదు చేయించుకోవాలని కోరారు. వీలైనంత ఎక్కువగా ఓటర్లను నమోదు చేయించాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు.

రాష్ట్రంలో జగన్‌కు ప్రవేశం లేదు : ఆలపాటి

కూటమి ప్రభుత్వానికి చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చి విజన్ ఉన్న చంద్రబాబును ఎన్నుకున్నారని కృష్ణా, గుంటూరు నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో గత పాలన వాసన తగలకుండా చూసుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. వైకాపా అనేక భ్రమలు కల్పిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికలకు వస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో ప్రవేశం లేదని ఈ ఎన్నికల ద్వారా తేల్చి చెప్పాలని పిలుపునిచ్చారు. పశ్చిమంలో 250 బూత్‌లు ఉన్నాయని, ఒక్కొక్క బూత్‌కి 50 నుంచి 100 వరకు ఓట్లు నమోదు చేయించాలని సూచించారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, మాజీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నాగుల్‌మీరా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టేటి హనుమంతరావు, కామా దేవరాజ్, డూండీ రాకేష్, గుర్రం కొండ, బంకా నాగమణి, నాగోతి రామారావు, పేరాబత్తుల రమణ, హరిబాబు, ధనేకుల సుబ్బారావు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కూటమిలో చేరేందుకు జగన్ తహతహ



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

భవానీపురం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ కూటమిలో చేరేందుకు వైకాపా అధినేత జగన్ తహతహలాడుతున్నారని భాజపా ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లికి, చెల్లికి మంచి చేయని జగన్ ప్రజలకు ఏం మంచి చేస్తాడని అతడిని నమ్ముతారని పేర్కొన్నారు. బాబాయ్‌ని చంపిన తమ్ముడిని కాపాడుతున్న రాక్షసుడు జగన్ అని పేర్కొన్నారు. ప్రస్తుతం గుడ్‌బుక్ అని జోకులు వేస్తున్నాడన్నారు. గత ఐదేళ్ల కాలంలో ప్రజలకు ఏం మంచి పనులు చేశాడని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో రహదారులు ఎంత అధ్వానంగా ఉన్నాయో ప్రజలందరికీ తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్రం నిధులు కేటాయిస్తుందని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తవుతాయన్నారు. అవన్నీ చూసి జగన్ బాధపడుతున్నాడని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని చెప్పడానికి జగన్‌కి అర్హత లేదన్నారు. భాజపా నాయకుడు కిలారు దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురంలోని ఉర్దూ పాఠశాల, కుమ్మరిపాలెం సెంటర్‌లోని డీఎస్‌ఎం పాఠశాలలోని వెయ్యి మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లను విపోదా ఫిన్సైర్ సొల్యూషన్స్ సంస్థ ఎండీ నక్కా రాంబాలాజీ బుధవారం అందజేశారు.

దుర్గాఘాట్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం



విద్యాధరపురం, న్యూస్‌టుడే: దుర్గాఘాట్ సమీపంలో తేలియాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని (55) వన్‌టౌన్ పోలీసులు బుధవారం గుర్తించారు. దుర్గాఘాట్‌లో విధులు నిర్వర్తించే గజ ఈతగాడు వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసు అధికారులు, పోలీసు కంట్రోల్ రూమ్ నెంబరు 100కు తెలియజేయాలని ఎస్సై రఘునాథ్ కోరారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

చిట్టినగర్, న్యూస్‌టుడే: భార్య, పిల్లలు తనకు దూరంగా ఉన్నారని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేట వడ్డెరవారివీధిలో బాయన దుర్గా మల్లేశ్వరరావు(26), మౌనిక సాయి భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు. తండ్రి నిర్వహించే బైండింగ్ షాపులో పనిచేసే మల్లేశ్వరరావు మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పది రోజుల కిందట భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. భార్య, పిల్లలు తనకు దూరమయ్యారనే మనస్తాపంతో పూటుగా మద్యం తాగుతున్నారు. 23న ఉదయం మల్లేశ్వరరావు ఉండే పోర్షన్‌లోకి తండ్రి శంకరరావు వెళ్లి తలుపులు తీసి లోపలికి చూశారు. పడక గదిలో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు శవపంచనామా చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రకట్ట రోడ్డు విస్తరణకు మోక్షం కలిగేనా..?

4 లేన్లుగా మార్చేందుకు అంచనాలు ☛ ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని వినతి



ఎర్రకట్ట ఇరుకు రోడ్డుపై వాహనాల రద్దీ ఇలా..

చిట్టినగర్, న్యూస్‌టుడే

అమరావతి రాజధాని కావడం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. కానీ నగరంలోని రహదారులు మాత్రం విస్తరణకు నోచుకోలేదు. వందలాది వాహనాల రాకపోకలతో ఎర్రకట్ట ప్రమాదాలకు నెలవుగా మారింది. హైదరాబాద్ నుంచి నగరంలోకి రాకపోకలు సాగించేందుకు గొల్లపూడి బైపాస్ నుంచి సొరంగం, ఎర్రకట్ట రహదారి సులువైన మార్గం. ఈ మార్గం విస్తరిస్తే నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. పైగా ప్రమాదాలు నివారించవచ్చు. ఆ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.



దెబ్బతిన్న రైల్వే వంతెన

తెదేపా హయాంలో రూ.88 కోట్లతో..

రాష్ట్రం విడిపోయిన అనంతరం తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఎర్రకట్ట రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని ప్రణాళికలు రూపొందించింది. అప్పటి కేంద్ర ప్రభుత్వం కూడా అనుమతులిచ్చింది. గొల్లపూడి బైపాస్ 'వై' జంక్షన్ రోడ్డు నుంచి చిట్టినగర్ సొరంగం, ప్రైజర్‌పేట, ఎర్రకట్ట, కేదారేశ్వరపేట, బీఆర్టీఎస్ రోడ్డును కలుపుతూ 4 లేన్ల రహదారి విస్తరణ చేయాలని ప్రణాళిక రూపొందించారు. గొల్లపూడి బైపాస్ నుంచి బీఆర్టీఎస్ రోడ్డు వరకు 5.5 కిలోమీటర్లు రోడ్డు విస్తరణకు సుమారు రూ.88 కోట్లు ఖర్చు అవుతుందని 2017లో ఆర్‌అండ్‌బీ అధికారులు అంచనా వేశారు. అప్పట్లో రైల్వే, ఆర్‌అండ్‌బీ, నగరపాలక సంస్థ, నగర పోలీస్ కమిషనరేట్, జిల్లా కలెక్టర్, అప్పటి మంత్రి దేవినేని ఉమ, తెదేపా ఎంపీ కేశినేని నాని పరిశీలించారు. 4 లేన్ల రోడ్డు విస్తరణకు, దెబ్బతిన్న రైల్వే వంతెన నిర్మాణానికి సౌత్ సెంట్రల్ రైల్వే అప్పటి ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్, సికింద్రాబాద్ నుంచి కూడా సుముఖత వ్యక్తమైంది. ఈ లోగా ప్రభుత్వం మారిపోయి వైకాపా ప్రభుత్వం వచ్చింది.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

పశ్చిమ, మధ్యనగరం నియోజకవర్గాలను కలిపే ఎర్రకట్ట రహదారి విస్తరణ నేపథ్యంలో పాతరాజరాజేశ్వరీపేట అంచున అడ్డుగా ఉన్న 29 ఇళ్లను కూడా తొలగించారు. ఈ లోగా 2019 ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రహదారి విస్తరణ విషయం వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. దీంతో అభివృద్ధి పూర్తిగా పడకేసింది. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆశలు చిగురించాయి. అప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రి హయాంలోనే ఎర్రకట్ట విస్తరణకు అంచనాలు వేశారు. ఎంపీ కేశినేని శివనాథ్, చంద్రబాబు ఈ రహదారి విస్తరణపై జోక్యం చేసుకుని పూర్తి వివరాలు అధికారుల నుంచి రాబట్టి 4 లేన్లుగా రూపుదిద్దేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ: 80085 74638

? క్వారీ సెంటరు సాయిబాబా గుడి వీధిలో ఫ్యూజ్ బాక్సులు తక్కువ ఎత్తులో ఉన్నాయి. వైర్లు వేలాడుతున్నాయి. ఈ వీధిలో నిత్యం పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఆవులు తిరుగుతున్నాయి. అధికారులు వీటిని ఎత్తులో ఏర్పాటు చేయాలి.

-వెంకటేశ్వరరావు, క్వారీ సెంటరు.

✔ క్వారీ సెంటరు సాయిబాబా గుడి వీధిలోని ఫ్యూజ్ బాక్సును పరిశీలించి రెండు రోజుల్లో ఎత్తు పెంచి ఏర్పాటు చేస్తాం. కొన్ని చోట్ల ఫ్యూజ్ బాక్సులు, ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డు ఎత్తు పెంచడంతో ఆవులు వాటి వద్దకు వెళ్తున్నాయి. వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. **-సతీష్‌కుమార్, ఆర్.ఆర్.నగర్ ఏఈ**

? కనకదుర్గానగర్‌లో ముక్కల చీరలను అందమైన ప్యాకింగ్ చేసి భక్తులకు అధిక ధరలకు అంటగడుతున్నారు. వాటిని అమ్మవారికి మొక్కు కింద ఇస్తే ఇది చీర కాదని తిప్పి పంపుతున్నారు. ఇటువంటి ముక్కల చీరలను విక్రయించకుండా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలి. **- రమణ, నాలుగు స్తంభాల సెంటరు.**

✔ ఈ విషయం ఈవో దృష్టిలో పెట్టి నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటాం. **-దుర్గగుడి సూపరింటెండెంట్ అమృతరావు. -న్యూస్‌టుడే, విద్యాధరపురం,**

నైపుణ్యాలు పెంచుకుంటే ఉజ్వల భవిత



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ కృష్ణవేణి

చిట్టినగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు నూతన అంశాలపై నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉజ్వల భవిత సాధ్యమని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ జి.కృష్ణవేణి అన్నారు. కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ విభాగం ఆధ్వర్యంలో మొంగో డీబీజెన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై హ్యాకథాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంప్యూటర్ రంగంలో వస్తున్న మార్పులు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఇలాంటి హ్యాకథాన్‌లు ఉపయోగపడతాయని అన్నారు. కంప్యూటర్స్‌పై పట్టు సాధించాలని సూచించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు రవీంద్ర, పవన్‌కుమార్, ఐక్యూఏసీ కన్వీనర్ షమీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ప్రదర్శనలో కళాకారిణులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా కళావేదికపై జగ్గయ్యపేటకు చెందిన నాట్యాచారిణి వలివేటి భారతీదేవి శిష్య బృందం బుధవారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అయిగిరి నందిని, కొలువైతివా రంగసాయి, నమః శివాయా వంటి భక్తి గీతలకు కళాకారిణులు చేసి నృత్యం అలరించింది. దేవస్థానం సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. డిప్యూటీ ఈవో రత్నంరాజు వారికి అమ్మవారి చిత్రపటం, ప్రశంసాపత్రాలను అందజేశారు.

బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ (ఐఏ అండ్ ఏడీ) శాఖ సౌత్ జోన్ బ్యాడ్మింటన్ టోర్నీ స్థానిక డీఆర్‌ఆర్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏజీ కార్యాలయానికి టోర్నీ కేటాయించడం గర్వకారణమన్నారు. ముందుగా ఆయన జ్యోతి వెలిగించి పోటీ ప్రారంభించారు. డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ పి.కిషోర్‌రెడ్డి, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ జితేంద్రనాథ్‌శర్మ, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ నిఖిల తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం బస్తాల పంపిణీ



బియ్యం బస్తాలు పొందిన మహిళలతో నిర్వాహకులు

భవానీపురం, న్యూస్‌టుడే: బుడమేరు వరద కారణంగా ముంపునకు గురైన జక్కంపూడి వైఎస్‌ఆర్‌కాలనీ వాసులకు బడావో బంజారా ప్రోజర్ ట్రస్ట్ నిర్వాహకులు సాయం అందించారు. కాలనీలోని 150 కుటుంబాలకు 25 కేజీల చొప్పున బియ్యం బస్తాలు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక డైరెక్టర్ భూక్యా లాజరస్ లాల్‌సింగ్ మాట్లాడుతూ బుడమేరు వరద కారణంగా జక్కంపూడి వైఎస్ ఆర్‌కాలనీ వాసులకు ఎంతో నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ ప్రేమ్‌సాగర్‌సింగ్ భూక్యా, కార్యనిర్వాహకులు సొలొమోను భూక్యా, నతానియేల్ నాయక్, మల్సూర్ నాయక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కూలిన గోడ వెంటనే నిర్మించండి



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని సూర్యారావుపేట కమలా నెహ్రూ ఉమెన్స్ హాస్టల్, మహిళా శిశుబాల సంక్షేమ సదన్ ప్రహరీని వెంటనే పునఃనిర్మించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఇటీవల కూలిపోయిన హాస్టల్ ప్రహరీని ఆయన బుధవారం పరిశీలించారు. ప్రహరీ తిరిగి నిర్మించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందున పనులు వేగంగా చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు. హాస్టల్‌లోని వారికి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు జీవీజీఎస్‌వీ ప్రసాద్, పి.సత్యనారయణ, జి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ మధ్య

సహ చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న త్యాగరాజు పక్కన అశోక్‌కుమార్, శ్రీనివాసరావు, శిరీష్‌బాబు తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అందరికీ తెలిసేలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.త్యాగరాజు అన్నారు. ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నామని చెప్పారు. ఆర్టీఐ కార్యకర్తలు ఇచ్చే అర్జీలపై సకాలంలో సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజాప్రయోజనం కోసం చేపట్టే వినతి పత్రాలపై అర్జీదారుల పేర్ల గోప్యత పాటించాలన్నారు. సహ చట్టంపై ప్రతి గ్రామంలోనూ ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి సంవత్సరం అక్టోబరులో వారోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ చట్టాన్ని పాఠ్యాంశంలో పొందుపరచాలని, దరఖాస్తుదారులపై జరిగే దాడులను అడ్డుకోవడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంస్థ సభ్యులు కె. అశోక్‌కుమార్, బత్తిన శ్రీనివాసరావు, శిరీష్‌బాబు, లక్ష్మణరావు, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం


మహిళకు చెక్కు అందిస్తున్న పరుచూరి రామకృష్ణ, ప్రసాద్ తదితరులు

పాయకాపురం(మధురానగర్), న్యూస్‌టుడే : గత నెలలో వచ్చిన వరదల్లో సర్వస్వం కోల్పోయిన 8 కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ కమ్మవారి ఐక్య సేవా సమితి రూ.1.10లక్షల ఆర్థిక సాయం అందజేసింది. కండ్రికలో బుధవారం సమితి సభ్యులు పర్యటించి బాధితులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ మాట్లాడుతూ బుడమేరులో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు తమ వంతు సాయం చేశామని వివరించారు. గత నెలలో 200 బాధిత కుటుంబాలకు వంట సామగ్రి, నిత్యావసరాలతో పాటు 3 రోజుల పాటు భోజనం అందించామన్నారు. సమితి కార్యవర్గ సభ్యుడు పరుచూరి ప్రసాద్, సూర్యదేవర మురళి, కొడాలి స్వాతి, పెమ్మసాని నాగలక్ష్మి, నెల్లూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగీత, సాహిత్య సేవకులకు పురస్కారాలు


సావనీర్ ఆవిష్కరిస్తున్న సూరిబాబు, శివన్నారాయణ, బుచ్చయ్యచార్యులు తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : కృష్ణమాచార్యుల కళాపీఠం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించే సంగీత విద్వాంసులు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల శత జయంతి ఉత్సవాలు శివరామక్షేత్రంలో బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు విష్ణుభొట్ల సోదరీమణులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంప్రదాయ కీర్తనలతో పాటు కృష్ణమాచార్యులు రచించిన కీర్తనలను గాయత్రి గౌరీనాథ్, స్వాతి, శ్రీకృష్ణ, రంగాచార్యులు, రాఘవకృష్ణ, సుబ్రహ్మణ్యరాజు అన్నపూర్ణ, లంకా మీనాక్షి, మహేశ్వరశర్మ తదితరులు ఆలపించారు. కృష్ణమాచార్యుల శతజయంతి సావనీర్‌ను సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి బుచ్చయ్యాచార్యులు మాట్లాడుతూ 2002లో కళాపీఠాన్ని కృష్ణమాచార్యులు ప్రారంభించారన్నారు. సంగీత, సాహిత్య సేవలు అందించిన వారికి ప్రతి ఏటా పురస్కారాలు ఇచ్చి సత్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంగీత కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. సంస్థ సభ్యులు కౌశిక్ కల్యాణ్, రామచక్రవర్తి, రామానుజాచార్యులు తదితరులున్నారు.

కూలిన గోడ పునర్నిర్మాణం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని సూర్యారావుపేట కమలా నెహ్రూ ఉమెన్స్ హాస్టల్, మహిళా శిశుబాల సంక్షేమ సదన్ ప్రహరీని వెంటనే పునఃనిర్మించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఇటీవల కూలిపోయిన హాస్టల్ ప్రహరీని ఆయన బుధవారం పరిశీలించారు. ప్రహరీ తిరిగి నిర్మించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందున పనులు వేగంగా చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు. హాస్టల్‌లోని వారికి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు జీవీజీ ఎస్‌వీ ప్రసాద్, పి.సత్యనారాయణ, జి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనలు నేడు

గాంధీనగర్, న్యూస్‌టుడే: శ్రీ సాయి హృదయ కళా నాట్యమండలి, గుమ్మడి జయరాజు కళాపీఠం, మంగమ్మతల్లి కళా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హనుమంతరాయ గ్రంథాలయంలో నాట్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు అగురు త్రినాథ్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చింతామణి, సత్య హరిశ్చంద్ర నాటకాలు ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

వారు తొలగించారు.. వీరు నిర్మించారు

★ ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత
★ నిస్సహాయులైన అధికారులు

విజయవాడ, న్యూస్‌టుడే

మధురానగర్ ఏలూరు కాలువ గట్టుపై దేవాలయాల పేరుతో వెలిసిన నిర్మాణాలు, ఇనుప తుక్కు వ్యాపారాల తొలగింపు ప్రక్రియ ఉద్రిక్తతలకు దారి తీసింది. పోలీసులు బందోబస్తు నిర్వహించేందుకు ముందుకు రాకపోయినా పట్టణ ప్రణాళికాధికారులు, జలవనరులశాఖ అధికారులు ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఉద్రిక్తత నెలకొన్న ప్రదేశానికి కూతవేటు దూరంలో పోలీస్‌స్టేషన్ ఉన్నా పోలీసులు అక్కడకు రాలేదు.

పోలీసుల రాకతో..

ఆక్రమ నిర్మాణాలతో పాటు పక్కనుండే పేరిట స్థానికులు ఏర్పాటు చేసుకున్న పార్కులను అధికారులు తొలగించారు. ఈ లోగా చుట్టుముట్టడంతో ఏం చేయలేక నిస్సహాయులై పోయారు. సాయం కోసం ఎవరూ రాకపోవడంతో వారంతా ఏం చేయలేకపోయారు. పరిస్థితిని గమనించిన మీడియా ప్రతినిధులు గుణదల సీఐకు సమాచారం అందించడంతో ఆయన అప్పటికప్పుడు పోలీసు సిబ్బందిని పంపించి పట్టణ ప్రణాళికా సిబ్బందిని అక్కడ నుంచి సురక్షితంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. పోలీసులు బందోబస్తుకు రాకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు అంటున్నారు.


మరలా ఏర్పాటు చేసిన నిర్మాణం


కొనసాగుతున్న తుక్కు వ్యాపారం

పత్తాలేని పోలీసులు

ఏలూరు కాలువ ఒడ్డున ఆక్రమణలను తొలగిస్తామని బందోబస్తు కావాలని గుణదల పోలీసులను పట్టణ ప్రణాళికాధికారులు రెండు రోజుల కిందట కోరారు. డ్రోన్ సమ్మిట్ కారణంగా పోలీసులెవరూ అందుబాటులో లేరని బుధవారం బందోబస్తు ఇస్తామని చెప్పారు. బుధవారం ఉదయం అధికారులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా బందోబస్తుకు ఎవరూ రాకపోవడంతో దాదాపు రెండున్నర గంటల ఎదురు చూశారు. ఆ తరువాత బందోబస్తు లేకుండానే తొలగింపునకు శ్రీకారం చుట్టడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దేవాలయం పేరుతో వెలిసిన నిర్మాణాలను సమూలంగా తొలగించారు. దీంతో స్థానికులంతా ఏకమై అధికారులను చుట్టుముట్టేశారు. కాలువగట్టున గతంలో నిర్మించిన దేవాలయాన్ని సైతం తొలగించేందుకు వెళ్లగా మరింత ఉద్రిక్తతలకు దారి తీసింది. ఇంత జరుగుతున్నా ఏలూరు కాలువగట్టుపై ప్రధాన సమస్యగా ఉన్న తుక్కు వ్యాపారుల వైపు అధికారులు ఎవరూ కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

భక్తి పేరిట రెచ్చగొడుతున్న నాయకులు

స్థానికంగా ఒక నాయకుడు తొలగించిన నిర్మాణాల వద్ద ధర్నా చేయమంటూ మహిళలను భక్తి పేరిట రెచ్చగొట్టి వారితో ఆందోళన చేయించారు. తన ఇంటి వద్ద గుడి కట్టవద్దంటూ గద్దె శ్రీను అనే వ్యాపారి అడ్డు చెప్పారు. జనాలను రెచ్చగొడుతున్న ముగ్గురు నాయకుల ఇళ్ల ముందు తాను కూడా మరో మూడు గుళ్లు కడతానంటూ చెప్పడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. కాగా అధికారులు అటు వెళ్లగానే తిరిగి నిర్మాణాలను మళ్లీ ఏర్పాటు చేశారు.

ఫిర్యాదు ఇవ్వమన్నా ఇవ్వలేదు: వాసిరెడ్డి శ్రీనివాస్, సీఐ గుణదల

పోలీసుల బందోబస్తు ఇవ్వలేదన్న దానిపై గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు రోజుల కిందట వచ్చారని డ్రోన్ సమ్మిట్ ఉండటంతో ఇవ్వలేదన్నారు. బుధవారం మరలా రావడంతో నిర్మాణాలను తొలగించామని చెప్పారన్నారు. అధికారులపై దాడులు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందిని పంపి వారిని స్టేషన్‌కు తీసుకువచ్చానని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు ఇవ్వమని అడిగానని వారు ఇవ్వలేదన్నారు.

సీపీని కలిసిన నూతన అధికారులు


సీపీ రాజశేఖరబాబుకు మొక్క అందిస్తున్న హోంగార్డ్స్ కమాండెంట్ ఆనందబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: సాధారణ బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ అయిన కమాండెంట్ టి.ఆనందబాబు, సీఎస్‌డబ్ల్యూ డీసీపీ ఎస్.వి.డి.ప్రసాద్ బుధవారం ఉదయం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కృష్ణా ఏఆర్‌లో అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రసాద్ ఎస్పీ (నాన్ కేడర్)గా పదోన్నతి పొంది ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లా పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ టి.ఆనందబాబును ఎన్టీఆర్ కమిషనరేట్‌లో హోంగార్డ్స్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. అధికారులిద్దరూ వారి కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీపీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ప్రభాస్ అభిమానుల రక్తదానం


దుప్పట్లు అందజేస్తున్న ఉమామహేశ్వరరావు, మురళీకృష్ణంరాజు, అప్పలరాజు


రక్తదానం చేస్తున్న ప్రభాస్ అభిమానులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ప్రముఖ కథానాయకుడు ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా వీర్ల పవన్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదానశిబిరం నిర్వహించారు. 53 మంది రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం ప్రాణదానం చేస్తుందని అందుకే ప్రభాస్ అభిమానులుగా రక్తదానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో లహరి, జఫార్. జామి కిరణ్, మనీష్ వర్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

తెదేపా సెంట్రల్ కార్యాలయంలో... బుధవారం రాత్రి తెదేపా సెంట్రల్ కార్యాలయంలో శివారెడ్డి ఆధ్వర్యంలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా చేతుల మీదుగా ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కోసి అభిమానులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో గంటా కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే, తన నటనతో జాతీయ స్థాయిలో సినీరంగంలో ప్రత్యేక స్థానాన్ని పొందిన నటుడు ప్రభాస్ అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ సంఘ అధ్యక్షుడు డి.మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో బుధవారం ముత్యాలంపాడులోని అల్లూరి సీతారామరాజు కల్యాణ మండపంలో ప్రభాస్ జన్మదినోత్సవం నిర్వహించారు. ముత్యాలంపాడులో దివంగత రెబల్‌స్టార్ కృష్ణంరాజు విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం పేదమహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ఆన్‌లైన్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు


సీఐటీయూ కార్యాలయంలో కేంద్రాన్ని ప్రారంభించిన నాయకులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సీఐటీయూ పిలుపు ఇచ్చింది. బుధవారం సంఘ జిల్లా కార్యాలయంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ. వెంకటేశ్వరరావు, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు కావాల్సిన వారు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎ.కమల, ఎం.శ్రీనివాస్, ఎం.సోమేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షల తేదీ ప్రకటించాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఎంతో కాలంగా నిరుద్యోగులు ఎదురు చూస్తున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల తేదీని ఏపీపీఎస్సీ నూతన ఛైర్మన్ ప్రకటించాలని ఏపీ నిరుద్యోగ ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గత గ్రూప్-1 ప్రాథమిక పరీక్ష ఫలితాలు తిరిగి విడుదల చేసి 1:100 నిష్పత్తిలో ప్రకటించాలని కోరారు. చాలా కాలం నుంచి అకాడమీ పుస్తకాలు అందుబాటులో లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతను అభ్యర్థులు అనర్హులయ్యారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఒక ఉద్యోగానికి వంద మందిని మెయిన్స్‌కి ఎంపిక చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: లైన్ల తనిఖీలు, మరమ్మతుల కారణంగా గవర్నర్‌పేట విద్యుత్తు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు గురువారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు కుప్పా వారి వీధి, లెనిన్ సెంటరు, బీసెంట్ రోడ్డు, పెద్దిభొట్లవారివీధి, కాళేశ్వరరావు రోడ్డు, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, అన్నదాన సమాజం రోడ్డు తదితర ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ పేర్కొన్నారు.

25న రక్తదాన శిబిరం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వారు జాతీయ స్థాయి ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఈ నెల 25న సూర్యారావుపేటలోని ఎంజే నాయుడు ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. 25న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుంది. ఇందులో దాతల నుంచి రక్తం సేకరిస్తారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించనున్నారు. ఆరోగ్యవంతులైన ప్రజలు శిబిరానికి వచ్చి రక్తదానం చేయాలని ఎంజే నాయుడు ఆసుపత్రి ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ తెలిపారు.

వరద బాధితుల కోసం తిరిగి సర్వే నిర్వహించండి

అందరికీ నష్టపరిహారం అందించకపోతే ఆందోళన ఉద్ధృతం

అజిత్‌సింగ్‌నగర్(మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరదలో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు తిరిగి ఇంటింటి సర్వే నిర్వహించాలని సీపీఎం డిమాండ్ చేసింది. బుడమేరు వరద బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం ఉత్తర మండల తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం నేతృత్వంలో వరద బాధితులు ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్, శ్రీదేవి తదితరులు మాట్లాడారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. మ్యాపింగ్ పేరుతో కుంటిసాకులు చెబుతున్నారని దుయ్యబట్టారు. ప్రతి బాధితుడికీ సాయం అందిస్తామన్న ప్రభుత్వ హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని బాధితుల దరఖాస్తులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాల్సి వస్తుందని, ముఖ్యమంత్రి ఇంటికి కూడా వెళతామని హెచ్చరించారు. బాధితులంతా తహసీల్దారు కార్యాలయంలో బైఠాయించారు. అధికారులు వచ్చి సరైన సమాధానం ఇచ్చే వరకు వెళ్లేది లేదని భీష్మించారు. ఈ సందర్భంగా అక్కడ ఉత్కంఠ నెలకొంది. ఆఖరికి అధికారులు వచ్చి సీపీఎం నేతలు ఇచ్చిన వినతిపత్రం స్వీకరించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బి.రమణారావు, కె.దుర్గారావు, సీహెచ్ శ్రీనివాస్, పీర్ సాహెబ్, కృష్ణమూర్తి, షకీలా తదితరులు పాల్గొన్నారు.


సీపీఎం నాయకులు, వరద బాధితుల ధర్నా

ఉనికి కోసమే బురద రాజకీయాలు

సీపీఎంపై బొండా ఉమా ఆగ్రహం


ఉమామహేశ్వరరావు

అజిత్‌సింగ్‌నగర్(మధురానగర్), న్యూస్‌టుడే: సీపీఎం తన ఉనికి కోసం బురద రాజకీయాలు చేయాలని చూస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. వరద వచ్చిన మొదటి రోజు నుంచి బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం అనేక సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు. బుధవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సీపీఎం నాయకుల వైఖరిని ఖండించారు. బుడమేరుకు వచ్చిన వరద ఫ్లాష్ ఫ్లడ్ అని నిపుణులు కూడా చెబుతున్నారని గుర్తు చేశారు. దీన్ని ముందుగా ఎందుకు కనుక్కోలేదని సీపీఎం ప్రశ్నించడం వారి మూర్ఖత్వానికి నిదర్శనం అన్నారు. నియోజకవర్గంలోని 8 డివిజన్లలో 70వేల కుటుంబాలకు పైగా ఆర్థిక సాయం వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇంకా కొద్ది మందికి ఇవ్వాల్సి ఉందని వారి వివరాలు, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో స్పష్టత లేకపోవటంతో పరిహారం ఇవ్వలేదన్నారు. సీపీఎం నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వరద సాయం అందని వారి వివరాలు అధికారులకు ఇవ్వాలని బొండా ఉమామహేశ్వరరావు సూచించారు.

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

● కష్టపడిన వారికి గుర్తింపు
● ఎం.పి.కేశినేని శివనాథ్


ఎంపీ శివనాథ్, వేదికపై రఘురామ్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి, అశోక్‌బాబు, జలీల్‌ఖాన్, వెంకన్న, నాగుల్‌మీరా, ఎంఎస్ బేగ్ తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: మనందరం చంద్రబాబు ఆస్తి అని, ఎలాంటి గ్రూపులు లేకుండా పని చేద్దామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పాలఫ్యాక్టరీ 'వి' కన్వెన్షన్‌లో పశ్చిమ నియోజకవర్గ తెదేపా విస్తృత స్థాయి సమావేశం, కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల నమోదు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పశ్చిమంలోని కార్యకర్తల ఆర్థిక పరిస్థితి ఏ ఒక్కరిదీ బాగోలేదన్నారు. చిరు వ్యాపారం చేసుకునే పార్టీ కార్యకర్తలను ఆదుకునేందుకు ఒక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. పని చేసిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందని, మిగతా నియోజకవర్గంలో మాదిరిగానే ఇక్కడ కూడా సమంగానే పదవులు వస్తాయని, సమన్వయం పాటించాలన్నారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తున్నారని, ఆయనకు అత్యధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ ఓటు నమోదు చేయించుకునేవారు తప్పక 10వ తరగతి, ఇంటర్మీడియట్ రెండేళ్లు, డిగ్రీ 3 ఏళ్లు పూర్తి చేసిన వారు మాత్రమే పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థిని ఎన్నుకునేందుకు ఓటర్లుగా పరిగణిస్తారన్నారు. ఆన్‌లైన్‌లో గానీ, తహసీల్దార్ వద్ద గానీ నమోదు చేయించుకోవాలని కోరారు. వీలైనంత ఎక్కువగా ఓటర్లను నమోదు చేయించాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు.

రాష్ట్రంలో జగన్‌కు ప్రవేశం లేదని చెప్పాలి: ఆలపాటి

కూటమి ప్రభుత్వానికి చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చి విజన్ ఉన్న చంద్రబాబును ఎన్నుకున్నారని కృష్ణా, గుంటూరు నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో గత పాలన వాసన తగలకుండా చూసుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. వైకాపా అనేక భ్రమలు కల్పిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికలకు వస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో ప్రవేశం లేదని ఈ ఎన్నికల ద్వారా తేల్చి చెప్పాలని పిలుపునిచ్చారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, మాజీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నాగుల్‌మీరా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టేటి హనుమంతరావు, కామా దేవరాజ్, డూండీ రాకేష్, గుర్రం కొండ, బంకా నాగమణి, నాగోతి రామారావు, పేరా బత్తుల రమణ, హరిబాబు, ధనేకుల సుబ్బారావు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం


జ్యోతి వెలిగించి టోర్నీ ప్రారంభిస్తున్న చంద్రమౌళి సింగ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ (ఐఏ అండ్ ఏడీ) శాఖ సౌత్ జోన్ బ్యాడ్మింటన్ టోర్నీ స్థానిక డీఆర్ఆర్ఎంసీ ఇండోర్ స్టేడియంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏజీ కార్యాలయానికి టోర్నీ కేటాయించడం గర్వకారణమన్నారు. ముందుగా ఆయన జ్యోతి వెలిగించి పోటీ ప్రారంభించారు. డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ పి.కిషోర్‌రెడ్డి, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ జితేంద్రనాథ్ శర్మ, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ నిఖిల తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా క్రీడా జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో బుధవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-19 బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, జూడో క్రీడాంశాల్లో ఉమ్మడి కృష్ణాలోని క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ జిల్లా శాఖ కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. వారిని డీఎస్‌డీవో ఎస్‌ఏ అజీజ్ అభినందించారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్లకు వారు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

నీటి సరఫరా నిలిపివేత

విజయవాడ నగరపాలక సంస్థ: ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడా మైదానం ప్రాంగణంలోని రిజర్వాయర్‌కు అనుబంధమైన అంతర్గత కనెక్షన్ల సమస్యను పరిష్కరించేందుకు ఈనెల 24వ తేదీ సాయంత్రం నుంచి 25వ తేదీ వరకు నగరంలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు పరిధిలోని 7, 8, 19 డివిజన్లలో బాడవపేట, నెహ్రూనగర్, మొగల్రాజపురం, నవోదయ కాలనీ, జర్నలిస్టు కాలనీ, పీవీపీ రోడ్డు, డింపుల్ బార్ రోడ్డు, వర మహాలక్ష్మిరోడ్డు, మల్లెల పరమేశ్వరరావు రోడ్డు, ఉడ్‌పేట, మెరక ఉడ్‌పేట, శాంతినగర్, మధు గార్డెన్, రెల్లిస్ బజార్, లబ్బీపేట, పైడియ్య వీధి, వెంకటేశ్వరస్వామి గుడి రోడ్డు, తూర్లపాటి కుటుంబరావు రోడ్డు, గౌరయ్య వీధి, నేతాజీ బ్రిడ్జి రోడ్, కృష్ణానగర్, లక్ష్మీనగర్, గౌస్ వీధి, మజీద్ వీధి, గ్రీన్‌ల్యాండ్ వీధి, చంద్రమౌళీపురం, గాయత్రినగర్, కంచుకోటబజార్, ఓల్డ్ 5వ నెంబరు రూట్, అశోక్ నగర్, రామచంద్రనగర్, బ్యాంకు కాలనీ-1, 2, రెవెన్యూ కాలనీ, టిక్కిల్ రోడ్డు, మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీ, శ్యామ్‌నగర్, సిద్ధార్థ నగర్, బృందావన్ కాలనీ ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు వెల్లడించారు.

అదనపు ఫ్లోర్లకు ఆస్తి పన్ను విధించండి

విజయవాడ నగరపాలక సంస్థ: నగరంలోని నూతన భవనాలను గుర్తించి ఆస్తి పన్ను విధించి వసూలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మూడు సర్కిళ్ల రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ రెవెన్యూ సెక్రటరీలు, క్షేత్ర స్థాయి సిబ్బందితో ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నగరంలో అదనపు ఫ్లోర్ల నిర్మాణాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి వాటికి కూడా ఆస్తి పన్ను విధించి వసూలు చేయాలని అన్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి పన్ను విధించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా నిర్మాణాలను గుర్తించి పన్నులు విధించి నగరాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. నీటిపన్ను వసూలు చేసే విషయంలో ఇంజినీరింగ్ అధికారులతో రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. అధికారులు జి.సృజన, జి.సామ్రాజ్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పునశ్చరణ తరగతులు

గవర్నర్‌పేట: ఎన్టీఆర్ జిల్లాలో 10వ తరగతి బోధించే ఉపాధ్యాయులు పునశ్చరణ తరగతులను ఉపయోగించి రాబోయే పరీక్షల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి 30 వరకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు పునశ్చరణ తరగతులు గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూలులో బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని ప్రారంభించిన యు.వి.సుబ్బారావు మాట్లాడుతూ రోజుకొక సబ్జెక్టుపై జరిగే ఈ తరగతులను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా నిర్వహించే ఈ తరగతులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్‌లుగా తీసుకున్నామన్నారు. తొలి రోజు తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వగా దాదాపు 90 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో నార్త్ ఎంఈఓ వెంకటేశ్వర్లు, సీవీఆర్ స్కూలు ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, నాగరాజు, శైలజ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాతరాజరాజేశ్వరీపేట నివాసితుల ఆందోళన

ఎవరి ఇళ్లూ కూల్చరని ఎంపీ హామీ

చిట్టినగర్, న్యూస్‌టుడే: 56వ డివిజన్ పాత రాజరాజేశ్వరీపేటలో నాలుగు దశాబ్దాలకు పైగా తాము నివాసం ఉంటున్నామని, తమ ఇళ్లను రైల్వే అధికారులు తొలగించకుండా చూడాలంటూ బాధితులు బుధవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ప్రభుత్వం ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ 5వ రోజూ స్థానికులు నిరసన కొనసాగించారు. కార్యక్రమంలో కుర్షీఫదా, షాహీన్, పాండు, అఫ్సర్, శ్రీనివాసరావు, మున్నీ తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్



రోడ్డుపై బైఠాయించి ఆర్ఆర్‌పేట వాసుల నిరసన

ఎన్డీఏ ప్రభుత్వంలో అన్యాయం జరగదు..

ఎన్డీయే ప్రభుత్వంలో ఎవరికీ అన్యాయం జరగదని పాత రాజరాజేశ్వరీపేట రైల్వే స్థలాల్లో నివాసితులకు ఎంపీ కేశినేని శివనాథ్ అభయం ఇచ్చారు. బుధవారం సాయంత్రం ర్యాంపు రోడ్డులోని నిరసన శిబిరానికి ఎంపీ వచ్చి నిరసన తెలుపుతున్న స్థానికులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యకు ముందుగా తాత్కాలిక పరిష్కారం చూద్దామన్నారు. అనంతరం శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని, ఎవరి ఇళ్లు కూల్చరని చెప్పారు.

ఎంతకష్టం వచ్చిందో..!



విజయవాడ పశ్చిమ బైపాస్‌పై వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా గొల్లపూడి వద్ద రహదారిని గుత్తేదారు సంస్థ సిబ్బంది లోతుగా తవ్వడంతో ఆ గుంతలను కష్టంగా దాటుకుంటూ వెళ్తున్నారు. చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. బైపాస్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనచోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు. బైపాస్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేస్తే నున్న, గన్నవరం, హనుమాన్‌జంక్షన్ తదితర ప్రాంతాలకు సులభంగా వెళ్లవచ్చని వేగంగా పనులు పూర్తి చేయాలని వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, గొల్లపూడి



ద్విచక్రవాహనదారుడి పాట్లు

అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న ఉచిత ఇసుక

తిరువూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేసిన ఉచిత ఇసుక విధానం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. అసలైన వినియోగదారులకు అందకుండానే దోపిడీదారులు పక్కదారి పట్టిస్తున్నారు. తిరువూరు మండలం చింతలపాడు-గానుగపాడు మధ్య ఉన్న వాగులో ఇసుకను రెండు రోజుల నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లతో అక్రమంగా తరలించుకుపోతున్నారు. భవన నిర్మాణ కార్మికులు, చేతి వృత్తిదారులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం గృహ నిర్మాణదారులకు, ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే కట్టడాలు, నిర్మాణాలకు ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. అయితే ఉచిత ఇసుకను లబ్ధిదారులకు అందించడంపై మార్గదర్శకాలపై స్పష్టత లేకపోవడంతో.. ఇసుక మాఫియా రెచ్చిపోతున్నారు.

ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేలంట: రహదారులపై చీమల దండు చందంగా ఇసుక ట్రాక్టర్లు కళ్ల ముందు వెళుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మరోవైపు గానుగపాడు రేవులో ఇసుక తోడుతున్న ప్రదేశానికి దగ్గరలోనే వంతెన, చెక్ డ్యామ్ ఉంది. ఇసుక ఇలానే తవ్వుతూ పోతే వంతెన పిల్లర్ల పునాదులు కదిలి వరదల సమయాల్లో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మరోవైపు రేవు నుంచి బయటకు తరలిస్తున్న ఒక్కో ఇసుక ట్రాక్టర్‌కు రూ.3వేలు, రూ.3500 వరకు విక్రయిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు సీనరేజీ అంటూ డబ్బులు కూడా వసూలు చేస్తున్నారని చెప్పుకుంటున్నారు. ఏమైనా అధికారుల పర్యవేక్షణలో ఉచిత ఇసుకను అసలైన వినియోగదారులకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



గానుగపాడు రేవులో ఇసుక కోసం వచ్చిన వందల ట్రాక్టర్లు

బ్యాలెట్‌తోనే ఎన్నికలు నిర్వహించాలి

మాజీ ఎంపీ డాక్టర్ చింతా మోహన్

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్న చోట భాజపా ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తోందని మాజీ ఎంపీ డాక్టర్ చింతా మోహన్ ఆరోపించారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం నిలబడాలంటే బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బుధవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ బాగా నష్టపోయిందన్నారు. ప్రస్తుతం బడ్జెట్ ప్రవేశపెట్టే పరిస్థితులు లేకపోవడం విచారకరమన్నారు. పోలవరం ప్రాజెక్టు మరో వందేళ్లయినా పూర్తి కాదని, నలుగురు ముఖ్యమంత్రుల వద్ద పనిచేసిన ఒక అధికారిని కలిసి ఈ విషయాన్ని ప్రస్తావిస్తే ఈ ప్రాజెక్టు కట్టే సామర్థ్యం ఇక్కడి కాంట్రాక్టర్లకు లేదని, ఒకవేళ కట్టినా అది కూలిపోతుందని చెప్పారన్నారు. ఈ ప్రాజెక్టును కట్టే సామర్థ్యం ఉన్న కంపెనీలు ప్రపంచంలో మూడే ఉన్నాయని అవి చైనా, అమెరికా, జర్మనీలో ఉన్నట్లు ఆయన చెప్పినట్లు తెలిపారు. రాజధాని అమరావతి పూర్తి కావాలంటే మరో వందేళ్లు పడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు చూసినా అమరావతి, పోలవరం అంటున్నారని మొన్న లడ్డూ, నేడు డ్రోన్ ఇలా నెలకో అంశాన్ని తెరమీదకు తెచ్చి అసత్యాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. కొందరు స్వార్థప్రయోజనాల కోసం దళితులను మాల, మాదిగలుగా విడగొట్టారన్నారు. హరియాణాలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ఈవీఎంల ట్యాంపరింగేనని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఆయన కోరారు.

కోనేరు రంగారావు సిఫార్సులు అమలు చేయాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేసి రాష్ట్రంలో భూమి లేని ప్రతి పేద రైతు కుటుంబానికి భూ పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో లోపాలు, తప్పులు, అక్రమాలు జరిగాయని భావిస్తే రెవెన్యూ కార్యాలయాల్లో చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందన్నారు. ఇప్పుడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుండగా గత ప్రభుత్వం రూపొందించిన కొత్త భూమి రికార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచకుండా నిర్వహించే సదస్సుల వల్ల ఎలాంటి ఉపయోగం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ రీసర్వేలను పూర్తి చేసి కొత్త రికార్డులను ఉనికిలోకి తీసుకొచ్చిన గ్రామాల విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరి వెల్లడించాలన్నారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ కార్యాలయంలో విచారించే రికార్డ్ ఆఫ్ రైట్స్ యాక్ట్ కేసులన్నింటినీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉండే డీఆర్వోకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని దీంతో రెవెన్యూ కేసులు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయని ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కేవీపీసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.నటరాజ్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయాల్లో ఉంచిన చేతిరాత 1బి రికార్డులను ఆయా మండలాలకు వెంటనే పంపాలని కోరారు. సమావేశంలో బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, కార్యదర్శి శేఖర్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బారావు, సమావేశమైన ప్రతినిధులు

బ్యాడ్మింటన్ పోటీలకు కృష్ణా వర్సిటీ జట్టు



ఎంపికైన క్రీడాకారులతో కమిటీ సభ్యులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే కృష్ణా వర్సిటీ జట్టును ఎంపిక కమిటీ ఛైర్మన్ ఎం.రమేష్ బుధవారం వెల్లడించారు. జట్టులో పీబీ సిద్ధార్థ కళాశాలకు చెందిన పి.ప్రహన్‌కుమార్, వై.నాగకల్యాణ్, ఎస్.పోతురాజు, ఐ.ఈశ్వర్‌సాయి, కానూరు ఎస్వీడీ న్యాయ కళాశాలకు చెందిన టీఆర్ఎన్‌వీ సాయికృష్ణ, పవిత్ర డిగ్రీ కళాశాలకు చెందిన బి.చిద్విరాయ్, నున్న వికాస్ వ్యాయామ విద్య కళాశాలకు చెందిన కె.విజయ విహారి స్థానం సాధించారని ఆయన తెలిపారు.

ఉత్సాహంగా వర్సిటీ కబడ్డీ టోర్నీ ప్రారంభం




కబడ్డీ కోర్టును ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక ఎస్సార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలను బుధవారం కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి ప్రారంభించారు. అనంతరం టోర్నీలో పాల్గొన్న పలు జట్ల క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకున్నారు. 11 జట్లు తలపడగా.. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో ప్రారంభించామని టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి, కళాశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి డి.యుగంధర్ తెలిపారు. తొలి రోజు ఆటలు ముగిసే సమయానికి ఆతిథ్య ఎస్సార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల, ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల (ఉయ్యూరు)జట్లు లీగ్ దశలో ప్రవేశించాయి. డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మైలవరం), పీబీ సిద్ధార్థ కళాశాల జట్ల మధ్య లీగ్ ప్రవేశ మ్యాచ్ జరుగనుంది. లీగ్‌లో ప్రవేశించిన నాలుగు జట్ల మధ్య గురువారం మ్యాచ్‌లు జరుగుతాయని యుగంధర్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : అయోధ్యనగర్ లోటస్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో సోమవారం అర్ధరాత్రి తరువాత జరిగిన హత్య కేసులో నిందితుడైన సాగి నరసింహరాజును అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. నరసింహరాజు తన స్నేహితుడైన మహమ్మద్ రఫీతో లోటస్‌లోని తన ప్లాట్‌లో ఉన్నారు. వారి మధ్య వివాదం జరిగి మద్యం మత్తులో తనపై మహమ్మద్ రఫీ కత్తెరతో దాడి చేయబోయాడని టవల్‌తో గొంతు నులమడంతో చనిపోయాడని నరసింహరాజు చెబుతున్నారు. పోలీసులు నిందితుడిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. 14 రోజుల రిమాండ్ విధించగా జిల్లా జైలుకు తరలించారు.



వంకాయలు-40, టమాటా-38/42, బెండ-44, పచ్చిమిర్చి-44, కాకర-38, బీర-40, క్యాలీ ఫ్లవర్-30/35, క్యాబేజి-32, క్యారెట్-48, దొండ-30, బంగాళదుంప-38, ఉల్లిపాయలు-48, గోరు చిక్కుళ్లు-32, దోస-36, సొర-20/25, పొట్ల-20/25, అరటికాయ-5/6, చామదుంప-36, అల్లం-70/140, మునగ-7/8, ఆకు కూరలు (కట్ట)-4, కంద-56, బీట్ రూట్-34, కీరదోస-32, బీన్స్-130, క్యాప్సికమ్-75, నిమ్మ (డజను)-32/40, కొత్తిమీర కట్ట-20/10, పుదీనా-5/20, ముల్లంగి-8, పచ్చిమామిడి-14/15 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, (విజయవాడ)**

అంతర పంటతో ప్రయోజనాలు మెండు

కంచికచర్ల, వీరులపాడు, న్యూస్‌టుడే



తోటలో కలుపు మొక్కలు ఏరుతున్న రైతు రాజశేఖర్

వినూత్న పద్ధతులు ఆచరిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకుంటున్నారు వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన రైతు వెంపటి రాజశేఖర్. 4 ఎకరాల పొలంలో మామిడి, జామ మొక్కలు నాటిన అతను పంట కాలం వృథా కాకుండా.. ఖరీఫ్ సీజన్‌లో సొర్ల మధ్య పెసర పైరు వేశారు. వరదల కారణంగా కొంత పంట నష్టపోయినప్పటికీ నిరాశ చెందలేదు.

పెసర కోత అనంతరం పండ్ల మొక్కల మధ్యలో కూరగాయలు సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకు పొలాన్ని సిద్ధం చేసి మొక్కల మధ్య ఖాళీలో టమాటా మొక్కలు నాటారు. నాలుగెకరాల పండ్ల తోటలో టమాట సుమారు ఒక ఎకరాలో పండిస్తున్నారు. టమాటా సాగు చేయడానికి అతను ప్రత్యేకంగా ఖర్చు పెట్టింది కేవలం రూ.15 వేలు మాత్రమే.

పెట్టుబడి తక్కువ..

టమాట ఎత్తు పెరిగిన తరువాత సొర్ల మధ్యలోని ఖాళీ స్థలంలో ఇతర కాయగూరల సాగు చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. పండ్ల తోటలో అంతర పంటల వల్ల సాగు ఖర్చు సగానికి సగం తగ్గుతుందని ఆయన వివరించారు. పండ్ల మొక్కలకు పురుగు, చీడపీడలు ఆశించకుండా వాడే రసాయనాలే కాయగూరల మొక్కలకు సరిపోతాయని, వాటికి ప్రత్యేకంగా పిచికారీ చేసే పని ఉండదని చెబుతున్నారు. పండ్ల మొక్కలకు అందించే నీరే కాయగూరలకు సరిపోతుందని, వాటికి వేసిన ఎరువులే కాయగూరలకు పనికి వస్తాయని వివరించారు. పెట్టుబడి తక్కువ దిగుబడి అధికంగా వస్తుందని చెప్పారు. అంతర పంటలను ప్రతి సీజన్‌కు మార్చి మార్చి వేయడం ద్వారా పండ్ల తోటల్లో వచ్చే చీడ పీడలను కూడా అదుపు చేయవచ్చని వివరించారు. ఒకే పంట కాలంలో వివిధ పంటలను సాగు చేస్తూ సహచర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

రైతు ప్రశ్న - నిపుణుల సలహా

ప్రశ్న: వంగ పంటకు అనువైన నేలలు, విత్తే కాలం, విత్తన మోతాదు గురించి వివరించండి?

– ఎన్.రంగారావు, రైతు, మల్లంపల్లి

సమాధానం: వంగ ఉష్ణ మండల పంట. నీటి ఎద్దడి తట్టుకోగలదు. సారవంతమైన, మురుగు నీరు పోయే అన్ని రకాల నేలలు సాగుకు అనుకూలం. నేల ఉదజని సూచిక 5.5-6.5 మధ్య ఉంటే మేలు. ఏడాది పొడవునా పండించవచ్చు. అక్టోబరు, నవంబరు నెలలైతే మరింత అనుకూలం. ఎకరానికి సూటి రకాలైతే 260 గ్రా., సంకర రకాలైతే 124 గ్రాముల విత్తనం సరిపోతుంది. నారుమడిలో విత్తు వేసి దాదాపు 30-35 రోజుల వయసు గల మొక్కలను ప్రధాన పొలంలో నాటుకోవాలి. గుబురు రకాలైతే 50×50 సెం.మీ. ఎడంతో నాటుకోవాలి.

– వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం

- న్యూస్‌టుడే, ఘంటసాల

మినుముకు ఆశించే పురుగులు.. నివారణ

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే



మారుకా మచ్చల పురుగు

ప్రస్తుతం కొందరు రైతులు మినుము పంట సాగు చేస్తున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల్లో పైరుకు ఆశిస్తున్న పురుగులు, నివారణ చర్యల గురించి ఏవో నాగేశ్వరరావు వివరించారు.

మారుకా మచ్చల పురుగు: ఇది పైరుకు ఆశిస్తే మొగ్గ, పూత, పిందె దశల్లో ఆకులను జల్లెడగా చేసి నష్టం కలుగజేస్తుంది. పూత దశలో పూలను గూడుగా చేసి లోపల పదార్థాన్ని తింటుంది. కాయలు తయారయ్యేటప్పుడు రంధ్రం చేసి లోపల గింజ తిని నష్టం కలుగజేస్తుంది. **నివారణ:** పురుగు ఉద్ధృతి అధికంగా ఉంటే స్పైనసాడ్ 0.3 మి.లీ., లేదంటే ఎమామెక్టిన్‌బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రైనాక్సిపిర్ 0.3 మి.లీ., ఫ్లూబెండమైడ్ 0.2 మి.గ్రా. లీటరు నీటిలో కలిపి చల్లటి వేళ పైరు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

కాండపు ఈగ: ఇది కాండంలో చేరి తినడం వల్ల మొక్క ఎండిపోతుంది. ఎక్కువగా తొలకరి పైరుపై ఆశిస్తుంది.

నివారణ: ఎసిఫేట్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఆకుపచ్చ తెగులు: ఈ తెగులు సోకిన ఆకులపై చిన్న గుండ్రని గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. అనుకూల వాతావరణంలో వలయాకారంగా మారి ఆకులు ఎండి రాలిపోతాయి.

నివారణ: లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

తుపాను వేళ.. పశు సంరక్షణ ఇలా..

కంకిపాడు, న్యూస్‌టుడే

రానున్న రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో భారీ వర్షాలు పడి... వరద ముంచుకొస్తే పశు సంరక్షణకు పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పశువైద్యాధికారి కె.మాధవరావు వివరించారు.

విపత్తుకు ముందు.. విపత్తు ప్రాంతంలో తాము ఉన్నదీ.. లేనిదీ నిర్ధారించుకోవాలి. అధికారుల సూచనల మేరకు అప్రమత్తం కావాలి. పశువును వరద ప్రాంతానికి దూరంగా ఉంచాలి. తాళ్లు, దాణా, పచ్చి/ ఎండు గడ్డి, ప్రాథమిక చికిత్స ఔషధాలు, బీమా పత్రాలు, బకెట్లు, టార్చ్‌లైట్, దుప్పట్లు తదితరాలతో కూడిన విపత్తు కిట్టు సిద్ధం చేసుకోవాలి. వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. పశువులు తప్పిపోకుండా చెవిపోగు వేయించాలి. గాలికి ఊడి పడే వస్తువులు, మండే స్వభావం ఉన్న పదార్థాలను పాక చుట్టుపక్కల ఉంచకూడదు.

వర్షాలు పడినప్పుడు.. పశువులు ఒత్తిడితో బెదరకుండా చూడాలి. శుభ్రమైన నీరు అందుబాటులో ఉంచాలి. నలతగా ఉన్నా, జబ్బు పడినా వెంటనే పశువైద్యశాలకు తోలుకెళ్లాలి. దాణా, మేత పొదుపుగా వాడాలి. అన్ని పశువులను ఒకేచోట ఉంచరాదు. పశువు



మృతి చెందితే దూరంగా గుంత తీసి పూడ్చాలి. జబ్బువాపు, గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి.

సాధారణ స్థితి వచ్చాక.. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేదాకా పోషణపై శ్రద్ధ అవసరం. శుభ్రమైన నీరు అందుబాటులో ఉంచాలి. మురికి నీరు తాగకుండా జాగ్రత్త పడాలి. ముంపునకు గురైన పాక ఆరబెట్టాలి. వైద్య పరీక్షలు చేయించాలి. పశువులు, షెడ్డుకు జరిగిన నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. పశువు మృతి చెందితే బీమా కోసం దరఖాస్తు చేయాలి.

దారి దాటాలంటే హడల్!

రామవరప్పాడు రింగ్ వద్ద నిత్యం ప్రమాదాలు

గత నెల 15న పాత రాజీవ్‌నగర్‌కు చెందిన లింగమనేని ప్రభు కుమార్ తల్లి కృష్ణ కుమారితో పాటు గుణదలలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. రామవరప్పాడు రింగ్ నుంచి గుణదల రోడ్డు వైపునకు తిరుగుతుండగా బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన తల్లీ కుమారులు అక్కడికక్కడే మృతి చెందారు.

ఈ ఏడాది జూన్ 21న రామవరప్పాడుకు చెందిన మత్తి మురళీ కుమారుడు దుర్గ ప్రసాద్‌ను ద్విచక్ర వాహనంపై సిద్దార్థ మెడికల్ కళాశాల మైదానానికి క్రికెట్ కోచింగ్ తీసుకు వెళ్తున్నాడు. రామవరప్పాడు రింగ్ నుంచి గుణదల రోడ్డు వైపునకు తిరుగుతుండగా.. ఓ లారీ వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రి కొడుకులు ఇద్దరు కింద పడిపోగా, కుమారుడిపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, న్యూస్‌టుడే

విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు రింగ్ వద్ద నిత్యం ప్రమాదాలతో ప్రజలు ప్రాణాలు హరిస్తూ రాకాసి జంక్షన్‌గా మారింది. వాహనదారులు దీన్ని దాటాలంటేనే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. దీని గుండా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు.



ఫ్రీ లెఫ్ట్ వెడల్పు తక్కువగా ఉండడంతో నేరుగానే బెంజ్ సర్కిల్ వైపు వెళ్తున్న భారీ వాహనాలు

ఇలా చేస్తే మేలు

- బెంజ్ సర్కిల్ వైపు వాహనాలు వెళ్లేందుకు రామవరప్పాడు రింగ్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్రీ లెఫ్ట్ మార్గం వెడల్పు పెంచాలి. బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే భారీ వాహనాలు కచ్చితంగా ఫ్రీ లెఫ్ట్ నుంచే వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.
- సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందిని కేటాయించాలి. గుణదల వైపు వెళ్లే వాహనాలు మాత్రమే సాధరణ మార్గంలో వెళ్లేలా చూస్తే ఈ జంక్షన్ వద్ద ప్రమాదాలు దాదాపుగా నివారించవచ్చు.

ప్రమాదానికి కారణాలేంటి..

గన్నవరం వైపు నుంచి బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే వాహనాలు రామవరప్పాడు రింగ్ వద్ద ఆగకుండా వెళ్లేందుకు పోలీసు అధికారులు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా వెళ్లే వాహనాలు రామవరప్పాడు రింగ్ సిగ్నల్స్‌తో సంబంధం లేకుండా వెళ్లిపోవడంతో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందనేది పోలీసుల ఆలోచన. కానీ ఫ్రీ లెఫ్ట్‌ను తక్కువ వెడల్పుతో ఏర్పాటు చేశారు. దీంతో భారీ వాహనాలు దీని నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే భారీ వాహనాలతో మిగిలిన వాహనాలు కూడా ఫ్రీ లెఫ్ట్‌లో కాకుండా సాధారణ మార్గంలోనే వాహనాలు వెళ్తున్నాయి. గుణదల రోడ్డులోకి వెళ్లే వాహనాలు రామవరప్పాడు రింగ్ వద్ద మీదుగా వెళ్తుంటారు. బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే భారీ వాహనాలు, గుణదల వైపు వెళ్లే వాహనాలు ఒకేసారి వదలడంతో ఆ వాహనాల పక్కన నుంచి ద్విచక్ర వాహనాలు గుణదల రోడ్డులోకి తిరుగుతున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 8 మంది ఇదే తరహా ప్రమాదంలో ఈ జంక్షన్ వద్ద మృతి చెందారు. అయినప్పటికీ అధికారులు నివారణ చర్యలపై దృష్టి సారించలేదు.

చంద్రబాబు దార్శనికతతో డ్రోన్ హాక్‌థాన్‌లో రికార్డులు

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు శివనాథ్(చిన్ని), సీఎం రమేష్, ఎమ్మెల్యేలు సత్యనారాయణ, విజయకుమార్‌లకు చిత్రపటం ఇస్తున్న అధికారులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత వల్లే డ్రోన్ హాక్‌థాన్‌లో ఐదు గిన్నిస్ రికార్డులు నమోదు అయ్యాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఇంద్రకీలాద్రిపై జగన్మాత దుర్గమ్మను ఎంపీలు కేశినేని శివనాథ్, సీఎం రమేష్‌లతో కలిసి ఆయన బుధవారం దర్శించుకున్నారు. అనంతరం మంత్రి, ఎంపీలు మాట్లాడుతూ జగన్మాత దుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డ్రోన్ సమ్మిట్ విజయవంతం అయ్యిందన్నారు. అంతకముందు దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వారికి వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. వారి వెంట మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా దేశాభివృద్ధి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న భాజపా నాయకులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా దేశాన్ని మరింత అభివృద్ధి పథం దిశగా అంకిత, సేవా భావంతో పని చేయనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దిల్లీ నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న కేంద్రమంత్రికి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, భాజపా సీనియర్ నేతలు సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు బుధవారం ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నేతృత్వంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత వంద రోజుల్లో అనేక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. పేదలకు సంబంధించిన సంక్షేమ పథకాల అమలు, ప్రపంచంలోని దేశాల మధ్య సయోధ్య కుదిర్చే విషయంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు.

29 నుంచి వైద్య మిత్రల సమ్మె

గాంధీనగర్, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారం కోరుతూ వైద్య మిత్రలు ఈ నెల 29వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నారని ఏపీ గ్రామ, సచివాలయ ఏఎన్ఎం హెల్త్ సెక్రటరీస్ అదర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తెలిపారు. బుధవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ వైద్య మిత్రలు 17ఏళ్లుగా క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని కోరారు. అంగన్‌వాడీ సమస్యలపై ముఖ్యమంత్రిని కలసి వినతిపత్రం ఇచ్చామని, ఇంత వరకు పరిష్కారం కాలేదన్నారు. మధ్యాహ్న భోజనం, ఆశా కార్మికుల సమస్యలు కూడా పరిష్కరించలేదన్నారు. ఆ రోజు జరిగే సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొంటాయని తెలిపారు. ఇసుక అవకతవకలపై నవంబరు 11న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

బ్యారేజీ 40 గేట్ల మూసివేత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద బుధవారం వరద ప్రవాహం మరింత తగ్గు ముఖం పట్టింది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 81,330 క్యూసెక్కుల నీరు రాగా, సాయంత్రం 6 గంటలకు 25,350 క్యూసెక్కులకు తగ్గింది. 30 గేట్లను అడుగు మేర ఎత్తారు. మిగతా 40 గేట్లు మూసివేశారు. సముద్రంలోకి 21,750, పంట కాల్వలకు 12,831 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పులిచింతల నుంచి 18,999, మునేరు (కీసర) నుంచి 5,989, పాలేరు నుంచి 362 క్యూసెక్కుల మేర వస్తోంది.

కాల్వలకు నీటి విడుదల పెంపు..

ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు నీటి విడుదలను పెంచారు. మొత్తం 12,831 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 7,822, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,009 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 4,188, ఏలూరు కాల్వకు 1,302, కేఈబీ కాల్వకు 1,102, బందరు కాల్వకు 1,300 క్యూసెక్కులు విడుదల చేశారు.

కేడీసీఏ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



ఏసీఏ అధ్యక్షుడు శివనాథ్‌తో కార్యవర్గ సభ్యులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా క్రికెట్ సంఘం (కేడీసీఏ) నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.వెంకట రత్నం బుధవారం ప్రకటించారు. కేడీసీఏలోని ఆరు పోస్టులకు నామినేషన్లు స్వీకరించారు. ఈ నెల 7న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఒక్కో పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ అర్హత పొందడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఆయన తెలిపారు. కేడీసీఏ నూతన అధ్యక్షుడిగా పొట్లూరి శ్రీనివాస్‌చౌదరి, ఉపాధ్యక్షుడిగా బండారు శ్రీనివాసరావు, కార్యదర్శిగా మేడసాని రవీంద్రచౌదరి, సంయుక్త కార్యదర్శిగా వెల్లమర్తి రజనీకాంత్, కోశాధికారిగా మొహమ్మద్ సాధిక్, కౌన్సిలర్‌గా పఠాన్ బాజీ షరీఫ్‌ఖాన్ ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు.... ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్‌ని నగరంలోని ఆయన కార్యాలయంలో కలిశారు. వారిని ఆయన అభినందించారు.

29న సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలు


విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రమే అర్హులని చెప్పారు. ఆసక్తిగల ఉద్యోగులు ఆధార్‌కార్డు, గుర్తింపు కార్డు, హోదా, కార్యాలయ అధికారి ధ్రువీకరణతో 29న ఉదయం 8 గంటలకు ఐజీఎంసీ స్టేడియంలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 98662 45746 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

దరఖాస్తుల గడువు 25 వరకు పొడిగింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు కొనసాగే శిక్షణ కోసం దరఖాస్తుల దాఖలు గడువును ఈ నెల 21 నుంచి 25 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అభ్యర్థులు http:///jnanabhumi.ap.gov.in (జ్ఞానభూమి) ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయ నిధికి విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కృష్ణారావు, రామకృష్ణారెడ్డి తదితరులు

పటమట, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల విరాళం అందించారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్ అందజేశారు. అసోసియేషన్‌లోని 3 వేల మందికిపైగా సభ్యులు తమ ఒకటిన్నర రోజుల పింఛను సీఎం సహాయనిధికి అందజేశారని చంద్రబాబుకు వివరించారు. సీఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు. సంఘం సలహాదారు ఎస్.వి.కృష్ణారావు, అధ్యక్షుడు ఎం.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.ఆర్.కె.రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా కమిటీ ఎన్నికలు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం జరిగాయి. ఎన్నికల్లో విజయవాడ, మచిలీపట్నం టీచింగ్, డెంటల్, ఆయుర్వేద, ఈఎస్ఐ, పీహెచ్‌సీల్లో శాశ్వత నర్సులుగా విధులు నిర్వహిస్తున్న వారు పాల్గొన్నారు. నర్సుల సంఘం అధ్యక్షురాలిగా షేక్ షమీవుల్ బేగం, ఉపాధ్యక్షురాలిగా ఇందిరా దేవి, కార్యదర్శిగా వేల్పుల జ్యోతి, కోశాధికారిగా కె.శివలీల.. మరో ఐదు మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు ప్రతి మూడేళ్లకోసారి జరుగుతాయని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎ.ధర్మారావు తెలిపారు.

పార్కుల్లో వాకింగ్ ట్రాకులు పెంచాలి

ఈనాడు డిజిటల్, అమరావతి: పట్టణ, నగర ప్రాంతాల్లోని ప్రజల సౌకర్యార్థం పార్కుల్లో నడక దారులను పెంచాలని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్(ఏపీసీసీఐఎఫ్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబుకు ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఉదయం పూట నడకకు సరైన ప్రదేశాలు లేకపోవడంతో ఎక్కువ మంది రోడ్లపైకి వస్తున్నారని.. దీంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు కుక్కల బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. విద్యాసంస్థల ఆట స్థలాలలో ప్రజలకు ఉదయం, సాయంత్రం నడక, వ్యాయామాలు చేసుకునేందుకు కొంత సమయం వరకు వీలు కల్పించేలా ప్రభుత్వం జీవో జారీచేయాలని కోరారు.